BALAGAM TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ శనివారం, 28 మార్చి-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8

ఎల్‌బి స్టేడియంలో శాసనసభ్యుల క్రీడోత్సవాలు



# ఇరాన్‌పై దాడులు తీవ్రం

- జానావాసలపై దాడిలో 26 మంది మృతి



టెహ్రాన్,మార్చి 27 : ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా ఇరాన్‌లోని ఇస్ఫా హాన్‌లో అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేశాయి. నివాసాలపై దాడి చేయడంతో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇరాన్‌లోని ఇస్ఫహాన్ ప్రావిన్స్‌లో అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో కనీసం 26 మంది మరణించినట్లు ఫార్స్ న్యూస్ ఏజెన్సీ నివేదించింది. నివాస ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని జరిగిన ఈ దాడుల్లో ఏడుగురు మహిళలు, ఏడుగురు చిన్నారులు ఉన్నారని పేర్కొంది.గత నెల 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేశాయి. ఈ ఘటనలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హతమయ్యాడు. అనంతరం ఇరాన్ ప్రతీకార దాడులు చేసింది. గల్ఫ్ దేశాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ దాడులు చేసింది. దీంతో ప్రపంచ వ్యాప్తంగా గ్యాస్, చమురు కష్టాలు మొదలయ్యాయి. ఇక హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. అంతేకాకుండా ఇజ్రాయెల్, అమెరికా మిత్రదేశాలకు చెందిన ఆయిల్ ట్యాంకర్లను విడిచిపెట్టబోమని ఇరాన్ తేల్చి చెప్పింది. దీంతో ప్రపంచ వ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## పారాక్వాట్ గడ్డి మందును నిషేధించండి



- దీంతో ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి
- పొలాలు, నీరు కలుషితం అవుతున్నాయి
- లోక్‌సభలో వరంగల్ ఎంపి కడియం కావ్య డిమాండ్

మిగతా 3లో..

## కమనీయం.. సీతారామ కళ్యాణం





- మిథిలా మండపంలో కన్నుల పడువగా కళ్యాణోత్సవం
- పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన సింఎం దంపతులు
- రామనామంతో మార్మోగిన భద్రాద్రి..భారీగా హాజరైన ప్రజలు
- పలవురు మంత్రులు, ప్రముఖుల రాక

భద్రాచలం వీధులు రామనామ స్మరణతో మార్మోగాయి. తెలంగాణ ప్రభుత్వం తరపున స్వామి వారికి సీఎం రేవంత్‌రెడ్డి, గీత దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఈ కల్యాణోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ భూమిపూజ చేశారు. తొలి విడతలో రూ.351 కోట్లతో చేపట్టే పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

## దేశంలో మరో అతిపెద్ద అంతర్జాతీయ విమనాశ్రయం



- నోయిడా జేవార్‌లో అందుబాటులోకి భారీ ఎయిర్‌పోర్టు
- నేడు ప్రధాని చేతుల మీదుగా ప్రారంభం
- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి

మిగతా 3లో..

## గొల్లపల్లి సీతారామచంద్రస్వామి కల్యాణ కళ్యాణోత్సవం



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



రాజన్న సిరిసిల్ల,మార్చి 27 : శ్రీరామనవమి సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని హనుమాన్ ఆలయంలో సీతారామచంద్ర స్వామి కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. సంప్రయాదబద్ధంగా పండితులు కళ్యాణతో వసం నిర్వహించారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.రాములోరి కల్యాణోత్సవాలకు హాజరైన సందర్భంగా కేటీఆర్‌కు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు.

## 25న పార్టీ పేరు, జెండాను, ఎజెండాను ప్రకటిస్తా

- ఇక తెలంగాణ ఆడబిడ్డ పార్టీ
- యువత, మహిళలకు మా పార్టీలో మంచి స్థానం
- మేడ్చెల్ మునీరాబద్ వేదికగా పార్టీని వెల్లడిస్తా
- శ్రీరామనవమి రోజు కాబట్టి ప్రకటన చేస్తున్నా
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రకటన



నిజామాబాద్,మార్చి 27 : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10గంటలకు నూతన రాజకీయ పార్టీ స్థాపించబోతున్నట్లు వెల్లడించారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని అధ్వయ కన్వెన్షన్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పార్టీ ప్రకటన చేయబోతున్నట్లు చెప్పారు. అదే రోజు పార్టీ పేరు, జెండాను ప్రకటిస్తామన్నారు. శ్రీరామనవమి మంచి రోజు కాబట్టి ఇవాళ ప్రకటన చేస్తున్నట్లు చెప్పారు. యువత, మహిళలకు మా పార్టీలో మంచి స్థానం ఉంటుంది. ఇన్నాళ్లూ మగ వాళ్లు ఏర్పాటు చేసిన పార్టీలను చూశారు. తెలంగాణ ఆడబిడ్డగా నేను పార్టీ పెడితే ఎలా ఉంటుందో మీరే చూస్తారని అన్నారు. ఈ మేరకు నూతన రాజకీయ పార్టీపై గతకొంతకాలంగా

మిగతా 3లో..

## హైదరాబాద్‌లో శ్రీరామనవమి శోభాయాత్ర



- యాత్రను ప్రారంభించిన గవర్నర్ శుక్లా
- బందోబస్తు పర్యవేక్షించిన సిపి సజ్జన్నార్

3లో..

## తమిళనాడులో సీట్ల పంపకాలపై అన్నామలై అసంతృప్తి

- బిజెపి గెలిచే చోట కేటాయించలేదని అసహనం
- కేంద్ర నాయకత్వానికి లేఖ రాసినట్లు సమాచారం

3లో..



## తెలంగాణలో సమృద్ధిగా పెట్రో నిల్వలు



- గణాంకాలు విడుదల చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, మార్చి 27: తెలంగాణ రాష్ట్రంలో ఇంధన సరఫరాకు సంబంధించి ప్రజల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేస్తూ ప్రభుత్వం తాజా నివేదికను విడుదల చేసింది. మార్చి 27నాటి అధికారిక గణాంకాల ప్రకారం, రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ నిల్వలు డిమాండ్ కంటే అత్యధికంగా అందుబాటులో ఉన్నాయని స్పష్టమైంది. సాధారణంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ అవసరమయ్యే ఇంధన పరిమాణం కంటే మార్చి 26వ తేదీన జరిగిన సరఫరా దాదాపు రెండింతలు ఎక్కువగా ఉండటం గమనార్హం. ఇది రవాణా రంగం, సామాన్య వినియోగదారులకు పెద్ద ఊరటనిచ్చే అంశం. పెట్రోల్ వినియోగాన్ని పరిశీలిస్తే, రాష్ట్రంలో రోజువారీ సగటు సరఫరా 5,883 కిలో లీటర్లుగా ఉంటుంది. అయితే, మార్చి 26 నాటికి ఏకంగా 16,609 కిలో లీటర్ల పెట్రోల్‌ను సరఫరా చేశారు. అంటే సాధారణ డిమాండ్ కంటే 182 శాతం అధికంగా పెట్రోల్ అందుబాటులో ఉంది. అదేవిధంగా, రవాణా , వ్యవసాయ రంగాలకు అత్యంత కీలకమైన డీజిల్ (ఊ÷ూఆ) సరఫరా కూడా ఆశాజనకంగా ఉంది. రోజువారీ సగటు అవసరం 7,348 కిలో లీటర్లు కాగా, ప్రభుత్వం ఏకంగా 19,580 కిలో లీటర్లను సరఫరా చేసింది. ఇది సాధారణ డిమాండ్ కంటే 167 శాతం ఎక్కువ. మొత్తంగా చూస్తే, రాష్ట్రవ్యాప్తంగా ఇంధన అవసరాలు తీర్చడానికి అవసరమైన సగటు 13,231 కిలో లీటర్లు అయితే, ప్రస్తుతం సరఫరా అవుతున్న పరిమాణం 36,189 కిలో లీటర్లుగా నమోదైంది. ఈ గణాంకాలను

మిగతా 3లో..

## పశ్చిమాసియా యుద్ధంతో ఇంధన సరఫరాలో సమస్యలు

- సమస్యలను పర్యవేక్షించేందుకు రాజ్‌నాథ్ నేతృత్వంలో కమిటీ
- పెట్రో ధరలపై ఎక్సైజ్ సుంక్ తగ్గించిన కేంద్రం
- పెట్రోల్‌పై రూ.13, డీజిల్‌పై 10 తగ్గిస్తూ ఆదేశం




న్యూఢిల్లీ,మార్చి 27 : పశ్చిమాసియాలో యుద్ధంతో దేశంలో గ్యాస్, క్రూడ్ ఆయిల్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో కేంద్ర కీలక నిర్ణయం తీసుకుంది. సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కేంద్ర మంత్రులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ ఈ కమిటీకి నేతృత్వం వహిస్తారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురి ఇందులో సభ్యులుగా ఉంటారు. మరోవైపు సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఎలాంటి భారం పడకుండా పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను కేంద్రం

మిగతా 3లో..

## కోర్టుల్లో ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయాలి

- మహిళా జడ్జీల పదోన్నతిపై దృష్టి సారించాలి
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్



న్యూఢిల్లీ,మార్చి 27 : కోర్టుల్లో ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయాలని, ప్రధానంగా మహిళా జడ్జీల పదోన్నతిపై దృష్టి సారించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఈ మేరకు సిజెఐ గతవారం 25 హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులకు లేఖ రాశారని సంబంధిత వర్గాలు శుక్రవారం తెలిపాయి. న్యాయవ్యవస్థలో జడ్జీల ఖాళీల భర్తీ విషయాన్ని, ధర్మాసనాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచాల్సిన అవసరముందని లేఖలో పేర్కొన్నారు. ముఖ్యంగా కోర్టుల్లో మహిళా జడ్జీల సంఖ్య తక్కువగా ఉందని అన్నారు. కొలీజియం సిఫారసులను ఆలస్యం చేయవద్దని, ఖాళీ కానున్నాయని తెలిసిన వెంటనే వాటిని భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన జడ్జీలకు సూచించారు.న్యాయరంగంలోని మరింత మంది మహిళలు వచ్చేలా న్యాయవ్యవస్థలో పెద్ద ఎత్తున సంస్థాగత మార్పులు చేపట్టాల్సి వుందని మార్చి8న అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఒక కార్యక్రమంలో సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. హైకోర్టు కొలీజియంలు జడ్జీల పదవుల భర్తీ కోసం ప్రతిభావంతులైన మహిళా జడ్జీలను మినహాయించకుండా, వారిని కేటాయించడం

మిగతా 3లో..

## అయోధ్యలో అద్భుత ఘట్టం ఆవిష్కృతం



- బాలరాముడిపై సూర్యకిరణాలతో తిలకం
- తిలకించి, పులకించిన భక్తజనం

అయోధ్య,మార్చి 27 : శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా అయోధ్యలోని భవ్య రామమందిరంలో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. శుక్రవారం మధ్యాహ్నం సరిగ్గా 12:00 గంటలకు అభిజిత్ ముహూర్తంలో బాలరాముడి నుదుటిపై సూర్య కిరణాలు తిలకంలా మెరిసిపోయాయి. సైన్స్, ఆధ్యాత్మికత కలబోతగా జరిగిన ఈ 'సూర్య తిలకం' వేడుకను చూసి లక్షలాది మంది భక్తులు పులకించి పోయారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ సూర్య తిలక వేడుకను నిర్వహించారు. మధ్యాహ్నం 12:00 గంటలకు ప్రారంభమై సుమారు కొన్ని నిమిషాల పాటు ఈ కాంతి తిలకం రామ్ లల్లాను ప్రకాశింపజేసింది. ఐఐటీ రూర్కీ శాస్త్రవేత్తల నేతృత్వంలో రూపొందించిన ఆటో-మెకానికల్ సిస్టమ్ ద్వారా సూర్య కిరణాలు నేరుగా విగ్రహంపై పడేలా ఎలాన్ చేశారు. ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించేందుకు దేశ విదేశాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంతో పాటు అయోధ్య అంతటా ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా భక్తులు ఈ వేడుకను ప్రత్యక్షంగా వీక్షించారు. సూర్య కిరణం రామ్ లల్లా నుదుటిపై పడగానే భక్తులు 'జై శ్రీరామ్' అంటూ చేసిన నినాదాలతో అయోధ్య నగరం మారుమోగిపోయింది.సూర్యవంశీయుడైన శ్రీరాముడికి సూర్యభగవానుడే స్వయంగా తిలకం దిద్దినట్లుగా ఉన్న ఈ దృశ్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. భక్తులకు కనువిందు చేయడమే కాకుండా భారతీయ ఇంజనీరింగ్ నైపుణ్యానికి ప్రతీకగా నిలిచింది.

## తిరుమలలో సీతారాములకు స్నపన తిరుమంజనం

తిరుమల,మార్చి 27 : శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తిరుమలలోని శ్రీ సీతా లక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్ర స్వామి ఉత్సవమూర్తులకు, స్నపన తిరుమంజనం నిర్వహించారు.శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలోని ప్రత్యేక వేదికపై ఉత్సవ మూర్తులకు కన్నుల పండుగగా స్నపన తిరుమంజనం జరిగింది. తిరుమల పెద్ద జీయర్ స్వామి, టీటీడీ ఈవో రవి చంద్ర, అదనపు ఈవో వెంకయ్య చౌదరిపాల్గొన్నారు.

## వైభవంగా సీతారామ కళ్యాణోత్సవం

ఆదోని,మార్చి 27: శ్రీరామ నవమిని పురస్కరించుకొని ఆదోని పట్టణం విక్టోరియా పేటలో వెలసిన అతి పురాతనమైన శ్రీ రామ దేవాలయంలో శుక్రవారం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా సాగింది. పండితులు వేదమంత్రాలు వల్లిస్తుండగా ఆలయ నిర్వాహకులు శ్రీ సీతారామ కల్యాణాన్ని జరిపించారు. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీ సీతారామ రథోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

## కోటనందూరులో కళ్యాణోత్సవం

కోనసీమ,మార్చి 27 : శ్రీరామనవమి పర్వదినాన కోటనందూరు మండలంలోని రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పి కొట్టంలోని సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సీతారాముల ఏకశిలా విగ్రహంతో మరో భద్రాద్రిగా పేరుగాంచిన ములగపూడి శ్రీ కోదండరామాలయంలో శుక్రవారం కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. శ్రీరామగిరిపై ఉన్న ఈ ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకొని ఉత్సవాన్ని కనులారా వీక్షించారు. ఐదు రోజులపాటు ఉత్సవాలు సాగనున్నాయని ఆలయ అధికారులు తెలిపారు.

## వరంగల్ రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

వరంగల్,మార్చి 27 : కాజీపేట-వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 35-40 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి ఏపీ ఎక్స్‌ప్రెస్ కిందపడి మృతి చెందాడు. రైలు కింద పడటంతో తలకు, ఇతర శరీర భాగాలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు క్రీమ్ కలర్ ఫార్మల్ ప్యాంట్, యాష్ / బ్లూ కలర్ ఫుల్ షర్ట్ ధరించి ఉన్నాడు. సుమారు 5 అడుగుల 6 అంగుళాల ఎత్తు, ఎరుపు వర్ణం, నల్లని తల వెంట్రుకలు, గడ్డం, మీసాలు కలిగి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కుడి చేతి పైన ఇంగ్లీష్ పచ్చబొట్టు తప్ప మరే ఇతర ఆధారాలు లభించలేదు. రైల్వే అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని ఎంజీఎం దవాఖాన మార్చురీలో భద్రపరిచి, దర్యాప్తు చేపట్టారు. మృతుడి ఆచూకి తెలిసిన వారు. 9701747014, 8712658627 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

## రాయవరం ప్రమాదంలో బస్సు యజమాని అరెస్ట్

మార్కాపురం,మార్చి 27 : మార్కాపురం బస్సు ప్రమాద ఘటనలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. బస్సు యజమాని, డ్రైవర్ పి.హరికృష్ణారెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. రాయవరం వద్ద గురువారం ప్రైవేటు ట్రావెల్స్ బస్సు- కంకర టిప్పర్ లారీ ఢీకొన్న ఘటనలో 14 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. బస్సు ప్రమాద సమయంలో హరికృష్ణారెడ్డి డ్రైవింగ్ చేసినట్లు పోలీసులు గుర్తించారు.ప్రమాదం తర్వాత ప్రయాణికులను వదిలేసి అతడు పరారయ్యాడు. నెల్లూరుకు పారిపోతుండగా గురువారం సాయంత్రమే పామూరు శివారులో పోలీసులు అతడిని పట్టుకున్నారు. ఇవాళ సాయంత్రంమార్కాపురంపోలీస్‌స్టేషన్‌కు తరలించే అవకాశం ఉంది.

# కమనీయం..సీతారామ కళ్యాణం











- మిథిలా మండపంలో కన్నుల పడువగా కళ్యాణోత్సవం
- పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన సీఎం దంపతులు
- రామనామంతో మార్మోగిన భద్రాద్రి.. భారీగా హాజరైన ప్రజలు
- పలవురు మంత్రులు, ప్రముఖుల రాక

భద్రాచలం,మార్చి 27 : శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవం కన్నులపండువగా కొనసాగింది. వేదపండితుల మంత్రోచ్ఛారణలతో రఘురాముడి కళ్యాణం రమణీయంగా సాగింది. రాములవారిని, సీతమ్మను మిథిలా మండపంలో వేంచేసి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సీతారాముల కళ్యాణాన్ని తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. దీంతో భద్రాచలం వీధులు రామనామ స్మరణతో మార్మోగాయి. తెలంగాణ ప్రభుత్వం తరఫున స్వామి వారికి సీఎం రేవంత్‌రెడ్డి, గీత దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఈ కల్యాణోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ భూమిపూజ చేశారు. తొలి విడతలో రూ.351 కోట్లతో చేపట్టే పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవంఅంగరంగ వైభవంగా జరిగింది. మిథిలా స్టేడియంలోని మండపంలో వేద మంత్రోచ్ఛరణల నడుమ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా శ్రీసీతారాములను పల్లకిలో ఊరేగింపుగా మండపానికి తీసుకొచ్చారు. శుక్రవారం ఉదయం 10:30 గంటలకు స్వామివారి కల్యాణ ఘట్టం మొదలైంది. అభిజిత్ లగ్నంలో సీతారామయ్యల శిరస్సుపై ఆలయ అర్చకులు జీలకర్ర, బెల్లం పెట్టారు. ఆపై సీతమ్మ మెడలో రామయ్య మాంగళ్యధారణ చేశారు. అనంతరం తలంబ్రాల వేడుక నిర్వహించారు. ఆలయ అర్చకులు ఇతర కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భద్రాద్రిలో జరుగుతున్న సీతారామయ్య కల్యాణాన్ని వీక్షించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి శ్రీరాముని భక్తులు భారీగా తరలివచ్చారు. శ్రీరామ నామస్మరణతో మిథిలా స్టేడియం ప్రాంగణం మార్మోగింది. సీతారాముల కల్యాణం సందర్భంగా మిథిలా స్టేడియంతో పాటు రామయ్య దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. భక్తులు భారీగా తరలిరావడంతో.. వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా దేవస్థానం అధికారులు, సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. లక్షల మంది భక్తులు ఆలయానికి చేరుకుని పెళ్లి వేడుకను కనులవిందుగా తిలకించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగలేటి సహా పలువురు ప్రముఖులు వేడుకలో పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం బేగంపేట విమానాశ్రయం నుంచి కుటుంబసమేతంగా సారపాక హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అనంతరం రోడ్డుమార్గాన భద్రాద్రి రాములవారి ఆలయం వద్దకు వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామిఅమ్మవార్ల వివాహ మహోత్సవానికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఉదయం 11:35 నుంచి మధ్యాహ్నం 12:25 వరకు మిథిలా స్టేడియంలో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం సారపాక హెలిప్యాడ్ నుంచి హైదరాబాద్‌కు తిరిగి బయలుదేరారు.

# ఒంటిమిట్టలో ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలకుశ్రీకారం

- తలంబ్రాల ప్యాకింగ్ పనిలో మహిళలు



ఒంటిమిట్ట,మార్చి 27 : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం ధ్వజారోహణంతో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 నుండి 10.15 గంటల మధ్య వృషభ లగ్నంలో పాంచరాత్ర ఆగమశాస్త్రబద్ధంగా గరుడపటాన్ని ప్రతిష్టించి శాస్త్రోక్తంగా ధ్వజారోహణ ఘట్టం నిర్వహించారు. కంకణబట్టర్ శ్రీ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా గరుడ ధ్వజపటాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి గరుడ ప్రతిష్ట, ప్రాణప్రతిష్ట, నేత్రోల్మీలనం నిర్వహించారు. ధ్వజస్తంభానికి నవకలశ పంచామృతాభిషేకం చేసినట్టు చెశారు. రాగతాళ నివేదన ద్వారా ఇంద్రాది సకలదేవతలను, నవగ్రహాలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించి ధ్వజారోహణం నిర్వహించారు.ఈ సందర్భంగా వేదపండితులు చతుర్వేద పారాయణం చేశారు.ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవోలు శ్రీమతి ఎ. ప్రశాంతి, శ్రీ ఎ. శివప్రసాద్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇకపోతే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏప్రిల్ 1న జరుగనున్న శ్రీ సీతారాముల కల్యాణం కోసం ఆలయంలో శుక్రవారం తలంబ్రాల ప్యాకింగ్‌ను టీటీడీ శాస్త్రోక్తంగా ప్రారంభించింది. ముత్యాల తలంబ్రాల ప్యాకింగ్ కార్యక్రమం శ్రీవారి సేవకులతో ప్రారంభించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్ద గల పిఏసి వద్దకు తీసుకొచ్చారు. శ్రీ సీతా రామ కళ్యాణం కోసం తలంబ్రాల తయారీకి అవసరమయ్యే పసుపు వినియోగించేందుకు మార్చి 25న పుసుపు దంచే కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడి హాలులో బియ్యం, పసుపు, నెయ్యి కలిపి తలంబ్రాలు తయారు చేస్తున్నారు. తలంబ్రాలతో పాటు ముత్యం, కంకణం ఉంచి 1.60 లక్షల ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నారు. కడప, అన్నమయ్య జిల్లాల నుండి శ్రీ కోదండరామస్వామి బ్రహ్మో త్సవాల్లో సేవలందించేందుకు దాదాపు 600 మంది శ్రీవారి సేవకులు తలంబ్రాల ప్యాకెట్లను తయారు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవోలు శ్రీమతి ప్రశాంతి, శ్రీ శివప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## దేశంలోని పౌర విమానయాన రంగంలో భద్రతపై పార్లమెంటరీ ప్యానెల్ తీవ్ర ఆందోళన




న్యూఢిల్లీ,మార్చి 27 : దేశంలోని పౌర విమానయాన రంగంలో భద్రతపై పార్లమెంటరీ ప్యానెల్ తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. 50 శాతం వాణిజ్య విమానాల్లో సాంకేతిక లోపాలు ఉన్నాయని స్టాండింగ్ కమిటీ ఆన్ సివిల్ ఏవియేషన్ తాజాగా వెల్లడించింది. ఏడాదికాలంగా చేపట్టిన తనిఖీల్లో వాటిని గుర్తించామని, తరచూ అవే సాంకేతిక సమస్యలు వెలుగు చూస్తున్నాయని పేర్కొన్నది. జనవరి 2025 నుంచి ఫిబ్రవరి 2026 వరకు 754 విమానాల్లో ఆడిట్ నిర్వహించగా.. 377 విమానాల్లో లోపాలు ఉన్నట్లు గుర్తించారు. ఆడిట్ చేసిన వాటిలో ఇండిగో విమానాల సంఖ్యే ఎక్కువని.. లోపాలు కూడా వాటిలోనే అధికంగా ఉన్నాయని స్టాండింగ్ కమిటీ ఆన్ సివిల్ ఏవియేషన్ వెల్లడించింది. ఫిబ్రవరి మూడు వరకు 405 విమానాల్లో ఆడిట్ నిర్వహించగా.. 148 ఫ్లైట్లలో లోపాలు ఉన్నాయని పేర్కొన్నది. కొన్ని లోపాలు రిపీట్ అయ్యాయని తెలిపింది. 166 ఎయిరిండియా, 101 ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానాల్లో తనిఖీలు చేపట్టారు. వాటిల్లోనూ లోపాలు వెలుగు చూశాయి. దాదాపు సగం ఈ రెండు విమానయాన సంస్థలకు చెందిన వాటిల్లోనే ఉన్నాయి. ఈ స్థాయిలో లోపాలు వెలుగు చూడటంపై కమిటీ ఆందోళన వ్యక్తంచేసింది. ఇవి ప్రయాణికుల భద్రత, సంస్థల విశ్వసనీయతపై ప్రభావం చూపిస్తాయని హెచ్చరించింది. గత ఏడాది అహ్మదాబాద్ విమాన ప్రమాదం తర్వాత ఎయిరిండియాపై డీజీసీఏ నిర్వహించిన ఆడిట్‌ను కూడా నివేదిక ప్రస్తావించింది. ఆ ఆడిట్‌లో దాదాపు 100 భద్రతాలోపాలను గుర్తించారు. అందులో 7 ఉల్లంఘనలు లెవెల్-1కి సంబంధించినవని, వాటివల్ల తీవ్ర ముప్పు పొంచి ఉండటంతో వెంటనే వాటిని సరిచూసుకోవాలని ఎయిరిండియాకు డీజీసీఏ సూచించింది. విమానాల మోడళ్లను బట్టి శిక్షణ విషయంలో వ్యత్యాసాలు ఉండటాన్ని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ప్రస్తావించింది. 2025 చివరి నాటికి భద్రతా ఉల్లంఘనలకు సంబంధించి 19 నోటీసులను విమానయాన సంస్థలకు డీజీసీఏ జారీ చేసింది. వాటిలో 9 నోటీసులు ఎయిరిండియాకే వెళ్లాయని వెల్లడించింది.

## కూలిన కళ్యాణోత్సవ వేదిక



### ఎమ్మెల్యే వేములకు తృటిలో తప్పిన ప్రమాదం

నల్లగొండ,మార్చి 27 : ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశంకు తృటిలో ప్రమాదం తప్పింది. కేతేపల్లి మండలం బండపాలెంలో శ్రీరామ నవమి వేడుకల్లో అపశృతి చోటు చేసుకుంది. శ్రీసీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదిక అకస్మాత్తుగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు ఈ వేడుకల్లో పాల్గొని వెళ్లిన కొద్దిసేపటికే ఈ ప్రమాదం జరిగింది. సీతారాముల కల్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఇలాంటి సమయంలో వేదిక కూలడంతో భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే ఈ అపశృతి జరిగిందంటూ తీవ్రంగా విమర్శించారు.

## నటుడు రాహుల్ రామకృష్ణ కుటుంబంలో విషాదం

- గడ్డి మందు ప్రభావంతో సోదరుడు మృతి
- పారాక్వాట్‌ను నిషేధించాలని రామకృష్ణ బహిరంగ వినతి



హైదరాబాద్, మార్చి 27: ప్రముఖ నటుడు, సినీ రచయిత రాహుల్ రామకృష్ణ కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆయన సోదరుడు పారాక్వాట్ అనే అత్యంత ప్రమాదకరమైన గడ్డి నివారణ మందు కారణంగా మరణించారు. ఈ విషాద వార్తను పంచుకుంటూ రాహుల్ రామకృష్ణ సోషల్ మీడియా వేదికగా చేసిన ట్వీట్ ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, పారాక్వాట్ వంటి ప్రాణాంతక రసాయనాలు మార్కెట్‌లో ఎంత సులభంగా అందుబాటులో ఉన్నాయో వివరించాడు. ఈ విషప్రయోగం వల్ల సంభవించే మరణాల సంఖ్యను చూసి వైద్యులు కూడా దిగ్భ్రాంతికి గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు రాహుల్ రామకృష్ణ ప్రధానమంత్రి కార్యాలయంతో పాటు తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయానికి బహిరంగ విన్నపం చేశారు. పారాక్వాట్ అనేది చాలా శక్తివంతమైన రసాయనమని, దీనికి ఎటువంటి విరుగుడు లేకపోవడం వల్ల ఇది శరీరంలోకి వెళ్ళిన వెంటనే ఊపిరితిత్తులు, కిడ్నీలు మరియు కాలేయాన్ని పూర్తిగా దెబ్బతీస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం వ్యవసాయ అవసరాల పేరుతో ఈ విషం మార్కెట్లలోనే కాకుండా ఈ-కామర్స్ సైట్లలో కూడా విచ్చలవిడిగా దొరుకుతోందని, దీనిని ఆత్మహత్యలకు ఎక్కువగా ఉపయోగిస్తున్నారని ఆయన వివరించారు. ఇలాంటి ప్రాణాంతక మందును తక్షణమే నిషేధించి మరిన్ని ప్రాణాలు పోకుండా కాపాడాలని ఆయన ప్రభుత్వాలను కోరారు. ఇప్పటికే పలు దేశాల్లో నిషేధానికి గురైన ఈ రసాయనంపై భారత్‌లో కూడా ఆంక్షలు విధించాలనే డిమాండ్‌కు నెటిజన్ల నుండి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది.

(మొదటిపేజీ తరువాయి)

## 25న పార్టీ పేరు, జెండాను, ఎజెండాను ప్రకటిస్తా



వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10 గంటలకు కొత్త పార్టీని స్థాపించనున్నట్లు తెలిపారు. మేడ్చల్‌లోని మునీ రాబాద్ వద్ద అద్వయ ఫంక్షన్ హాలులో జెండా ఆవిష్కరణ చేస్తామని ప్రకటించారు. ఆ సమయంలోనే పార్టీ పేరును కూడా ప్రకటించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలంతా సమయానికి చేరుకోవా లని, ప్రతి గ్రామం నుంచి తరలి రావాలని కవిత పిలుపునిచ్చారు. జయశంకర్ పేరు పెట్టుకుంటామని చెప్పారు. యువతకు, మహిళలకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. ఆడబిడ్డల్లో మార్పు తేవడానికి ఒక ఆడబిడ్డగా ఈ పార్టీని పెడుతున్నా నని తెలిపారు. బీసీ బిల్లు సాధించడం తమ వల్లనే సాధ్యమవుతుందని అన్నారు. బీసీలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు తరలిరావాలని కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ రాజకీయాలను శ్రీరాముడి స్ఫూర్తితో గమనించాలని కవిత అన్నారు. 'నేను నిజామాబాద్ బిడ్డను.. నిజామాబాద్ మట్టి మంచిది.. ఇక్కడ తీసుకునే ఏ నిర్ణయమైనా సక్సెస్ అయింది' అని తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాలు సంపూర్ణంగా సాధించలేకపోయామన్నారు. రోజూ ప్రజల అవస్థలు చూస్తున్నామని కవిత వ్యాఖ్యానించారు. కచ్చితంగా ఒక కొత్త రాజకీయ పార్టీ రావాల్సిన అవసరం ఉందన్నా రు. అందరూ మెచ్చేలా ఆ పార్టీ ఉండాలని అభిప్రాయప డ్డారు. సర్వోదయ తెలంగాణ రావాలని కవిత పేర్కొన్నారు. మేము ఎవ్వరికీ బీ పార్టీ కాము. మాది నంబర్ వన్ పార్టీ అవుతుంది. శ్రీరాముడి స్ఫూర్తితో, సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకుని పని చేస్తాం. ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. 95 శాతం తెలంగాణ ప్రాంతీయ పార్టీగా, ఇంటి పార్టీగా రాబోతోంది. ప్రజా సమస్యలపై వెంటపడి అడగాలి. ఎంపీ అర్వింద్ మతిమరుపు నాయకుడు. రైల్వే ఓవర్ బ్రిడ్జల జాప్యానికి నేనే కారణం అన్నారు. ఆయన వచ్చాక ఏం చేస్తున్నారు. అవసరమైతే ఢిల్లీలో లాబీ చేస్తా, గల్లీలో పని చేస్తా' అని కవిత స్పష్టం చేశారు.

## తెలంగాణలో సమృద్ధిగా పెట్రో నిల్వలు

బట్టి చూస్తే రాష్ట్రంలో ఎక్కడా ఇంధన కొరత లేదని, సరఫరా వ్యవస్థ అత్యంత పటిష్టంగా ఉందని ప్రభుత్వం భరోసా ఇస్తోంది. ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మవద్దని, ఇంధనం కోసం కంగారుపడి బంకుల వద్ద క్యూ కట్టాల్సిన అవసరం లేదని ఈ నివేదిక ద్వారా స్పష్టమవుతోంది. 'తెలంగాణ రైజింగ్' లక్ష్యంగా ఇంధన సరఫరాలో ఎక్కడా అంతరాయం కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది.

## కోర్టుల్లో ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయాలి

ఒక నిబంధనగా పరిగణించాలని అన్నారు. పదోన్నతి కోసం తమ పరిశీలన పరిధిని విస్తృతం చేయాలని, తమ రాష్ట్రాల్లోని, సుప్రీంకోర్టులో న్యాయవాదులుగా ప్రాక్టీస్ చేస్తున్న మహిళా న్యాయవ్యాదులను కూడా చేర్చుకోవాలని హైకోర్టు జడ్జిలకు సూచించారు. ప్రస్తుతం వివిధ హైకోర్టుల్లో పలువురు మహిళలు ప్రధాన జడ్జీలుగా విధులు నిర్వహిస్తున్నారని, పంజాబ్, హర్యానా హైకోర్టులో 18మంది మహిళా జడ్జీలు ఉన్నారని పేర్కొన్నారు. మద్రాస్, ముంబయి హైకోర్టుల్లో కూడా సుమారు 12మంది మహిళా జడ్జీలు ఉన్నారని ఆయన తెలిపారు. జిల్లా స్థాయిలో పనిచేస్తున్న న్యాయాధికారుల్లో మహిళలు సుమారు 36.3శాతం ఉన్నారని సిజెఐ పేర్కొన్నారు. ఇది ఒక సాధారణ గణాంకం కాదని, ఇది తరాల మార్పును ప్రతిబింబిస్తుందని అన్నారు. వ్యవస్థ పునాదిలోనే ఎక్కువ మహిళా భాగస్వామ్యం ఉన్నప్పుడు, అది అత్యున్నత న్యాయవ్యవస్థలో కూడా త్వరలోనే ప్రతిబింబిస్తుందని అన్నారు.

## పశ్చిమాసియా యుద్ధంతో ఇంధన సరఫరాలో సమస్యలు

తగ్గించింది. పెట్రోల్‌పై సుంకాన్ని లీటరుకు రూ.13 నుంచి రూ.3కు తగ్గించింది. లీటరుకు రూ.10గా ఉన్న డీజిల్ ఎక్సైజ్ సుంకాన్ని పూర్తిగా రద్దు చేసింది. హోర్ముజ్ జలసంధి మూసివేత భయాలు, మధ్యప్రాచ్య దేశాల మధ్య కొనసాగు తున్న యుద్ధంతో అంతర్జాతీయంగా చమురు సరఫరాకు అవాంతరాలు తలెత్తుతున్నాయి. పెరిగిన దిగుమతి వ్యయాన్ని తట్టుకుని చమురు సంస్థల రికవరీకి తాజాగా కేంద్రం తీసుకున్న చర్య ఉపయోగపడుతుంది. మరోవైపు, దేశవ్యాప్తంగా రిటైల్ ఔట్‌లెట్స్ యథాప్రకారం పనిచేస్తున్నాయని, అన్ని పంపుల్లోనూ తగినన్ని పెట్రోల్, డీజిల్ స్టాక్‌లు ఉన్నాయని పెట్రోలియం, నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. వదంతులు నమ్మవద్దని, ప్యానిక్ కొనుగోళ్లకు పాల్పడవద్దని వినియోగదారులను కోరింది. దేశంలో ఇంధన కొరతను అధిగమించేందుకు ప్రయత్నాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ఆ దిశగా చర్యలు తీసుకుంటోంది. డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ ల ఎగుమతిపై సుంకాన్ని విధించింది. అయితే, వీటి ధరలను ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షిస్తామని తెలిపింది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ ఛైర్మన్ వివేక్ చతుర్వేది ప్రకటన చేశారు. యుద్ధం కారణంగా ఇంధన సరఫరాలో అంతరాయం, ముడి చమురు ధరలు పెరుగుదలతో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు నష్టాలను ఎదుర్కొంటున్నాయని వివేక్ చతుర్వేది పేర్కొన్నారు. వీటిని పూడ్చడానికే పెట్రోల్, డీజిల్‌లపై ఎక్సైజ్ డ్యూటీల్లో కోత విధించామన్నారు. వీటివల్ల వినియోగదారులకు నేరుగా ప్రయోజనం చేకూరనప్పటికీ.. చమురు మార్కెటింగ్ కంపెనీలకు ఊరట లభించనుందన్నారు. ఈ చర్యల వల్ల వచ్చే పదిహేను రోజుల్లో రూ. ఏడు వేల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోతుందన్నారు. మరోవైపు, ఎగుమతులను అరికట్టడానికి డీజిల్, ఏటీఎఫ్‌లపై అదనపు సుంకాలను విధించామని సీబీఐటీ ఛైర్మన్ పేర్కొన్నారు. వీటి వల్ల వచ్చే పదిహేను రోజుల్లో ప్రభుత్వానికి రూ.1500 కోట్ల ఆదాయం వస్తుందన్నారు.

## ప్రవాస తెలుగు మహిళకు అరుదైన గౌరవం

### యూకేలోని వార్విక్ డిస్ట్రిక్ట్ కౌన్సిల్‌కు హేమ ఎంపిక

వరంగల్,మార్చి 27 : హనుమకొండకు చెందిన ప్రవాస భారతీయురాలు హేమ ఎల్లాప్రగడ అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. యూకే లోని వార్విక్ డిస్ట్రిక్ట్ కౌన్సిల్‌కు 2023లో అధికార గ్రీన్ పార్టీ సభ్యురాలిగా ఎన్నికైన ఆమె తాజాగా క్యాబినెట్ కౌన్సిల్ మెంబర్‌గా ఎంపికయ్యారు. స్థానిక నగరాల్లో పాలన సాగించేందుకు డిస్టిక్ట్ కౌన్సిల్స్ ఉంటాయి. డిస్టిక్ట్ కౌన్సిల్‌లో అత్యధిక స్థానాలు గెలుపొందిన పార్టీ నేతను లీడర్ ఆఫ్ ది కౌన్సిల్‌గా పిలుస్తారు. సభ్యుల్లో కొందరిని క్యాబినెట్ కౌన్సిల్ మెంబర్‌గా ఎంపిక చేసి వివిధ పరిపాలనా విభాగాలను అప్పగిస్తారు. అలాగే హేమ ఎల్లాప్రగడకు ఇప్పుడు డీకార్బనైజేషన్ బాధ్యతలు అప్పగించారు.

# పారాక్వాట్ గడ్డి మందును నిషేధించండి

- దీంతో ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి
- పొలాలు, నీరు కలుషితం అవుతున్నాయి
- లోక్‌సభలో వరంగల్ ఎంపి కడియం కావ్య డిమాండ్



హైదరాబాద్, మార్చి 27: పారాక్వాట్ డైక్లోరైడ్ (గడ్డి మందు)పై పూర్తి నిషేధం విధించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో డిమాండ్ చేశారు. శుక్రవారం పార్లమెంట్ జీరో అవర్‌లో ఆమె ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ.. ఈ రసాయనం వల్ల పర్యావరణం , మానవ ఆరోగ్యంపై పడుతున్న దుష్ప్రభావాలను వివరించారు. పారాక్వాట్ డైక్లోరైడ్ కేవలం కలుపు మొక్కలను నివారించే రసాయనం మాత్రమే కాదని, ఇది నేల, నీరు, గాలిని తీవ్రంగా కలుషితం చేస్తోందని ఎంపీ స్పష్టం చేశారు. వ్యవసాయ క్షేత్రాల్లో దీని మితిమీరిన వాడకం వల్ల భూసారం దెబ్బతినడమే కాకుండా.. భూగర్భ జలాలు కూడా విషతుల్యం అవుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇది పరోక్షంగా ఆహారపు గొలుసులోకి చేరి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోందని హెచ్చరించారు.గ్రామీణ ప్రాంతాల్లో ఈ గడ్డి మందు ఆత్మహత్యలకు ప్రధాన సాధనంగా మారడం అత్యంత కీలకమైన అంశం అని అన్నారు. చిన్నపాటి మనస్పర్థలు లేదా క్షణికావేశంలో ఈ రసాయనాన్ని సేవించిన వారు ప్రాణాలు కోల్పోతున్నారని ఆమె పేర్కొ న్నారు. పారాక్వాట్ సేవించిన సందర్భాల్లో మరణాల రేటు దాదాపు 100 శాతం ఉండటం అత్యంత భయానకమైన విషయం. దీనికి ఇప్పటివరకు ఎటువంటి విరుగుడు అందుబాటులో లేకపోవడం వల్ల ఆసుపత్రికి చేరినా ప్రాణాలు కాపాడటం అసాధ్యంగా మారుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్ సహా తెలంగాణలోని అనేక జిల్లాల్లో పారాక్వాట్ వల్ల జరుగుతున్న ప్రాణ నష్టాన్ని ఎంపీ వివరించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, పలువురు వైద్య నిపు ణులు కూడా ఈ రసాయనం వల్ల కలిగే ము ప్పును గుర్తించి, దీనిపై నిషేధం విధించాలని ఇప్పటికే గళమెత్తారు. ప్రజల ప్రాణాలను కాపాడటం కంటే వేరే ఏదీ ముఖ్యం కాదని, అందుకే కేంద్ర ప్రభుత్వం తక్షణమే దీని తయారీ, అమ్మకాలు ,వినియోగంపై సంపూర్ణ నిషేధం విధించాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రమాదకరమైన ఇటువంటి రసాయనాలకు బదులుగా పర్యావరణహితమైన, సురక్షితమైన ప్రత్యామ్నాయాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని..ఈ దిశగా ప్రభుత్వం అవగాహనకార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

# ఎల్‌బి స్టేడియంలో శాసనసభ్యుల క్రీడోత్సవాలు





- ఏర్పాట్లను పరిశీలించిన స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేన రెడ్డి

హైదరాబాద్, మార్చి 27: ఎల్బీ స్టేడియంలో ప్రారంభం కాబోతున్న శాసనసభ్యుల క్రీడోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. 28 నుంచి ఎల్ బి స్టేడియంలో ప్రారంభం కానున్న ఫస్ట్ ఎడిషన్ లెజిస్టేటివ్ స్పోర్ట్స్ మీట్ 2026 ఏర్పాట్లను ఆయన స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అన్ని వర్గాల్లో క్రీడల పట్ల అవగాహన తీసుకురావడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న శాసనసభ్యుల క్రీడోత్సవ పోటీలను ఘనంగా నిర్వహించబోతున్నామని, తద్వారా రాష్ట్రంలో క్రీడల పట్ల అవగాహన ఆసక్తి పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని వినియోగించ బోతున్నామని తెలిపారు. దాదాపు 14 సంవత్సరాల తర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా నిర్వహించబోతున్న ఈ క్రీడా పోటీలలో పార్టీల భేద భావాలు లేకుండా, అన్ని పక్షాల శాసనసభ్యులు శాసనమండలి సభ్యులు భాగస్వామ్యం కావడం సంతోషకరమని అన్నారు. ఈ ప్రారంభోత్సవ వేడుకల్లో టగ్ ఆఫ్ వార్, ఫుట్బాల్, క్రికెట్ , అలథెటిక్స్, కబడ్డీ,వాలీబాల్ బాడ్మింటన్,టేబుల్ టెన్నిస్, తోపాటు కొన్ని రిక్రియేషనల్ క్రీడా పోటీలు నిర్వహించబోతున్నయని తెలిపారు. ఈ పోటీలు వీక్షించడానికి అందరికీ ఉచిత ప్రవేశం కల్పించబోతున్నామని, అందరికీ అవసరమైన సౌకర్యాలను సమకూర్చామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# మూడ్రోజుల్లో ఈదురుగాలుల వర్షం

- తెలుగు రాష్ట్రాలకు వాతావరణశాఖ హెచ్చరిక



హైదరాబాద్, మార్చి 27: వేసవి భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ కాస్త ఉపశమనం కలిగించే వార్తను అందించింది. గత కొన్ని రోజులుగా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలతో సతమతమవుతున్న ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో రానున్న మూడు రోజుల పాటు వాతావరణం చల్లబడనుందని అంచనా వేసింది. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. తెలంగాణపై ప్రస్తుతం ఉన్న వాతా వరణ ద్రోణి ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. మరత్వాడా నుంచి కర్ణాటక తీరం వరకు సముద్ర మట్టానికి సుమారు 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ఈ ద్రోణి కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో మార్పులు సంభవించాయి. దీని ఫలితంగా శుక్ర, శని, ఆదివారాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా వర్షం కురిసే సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు మెరుపులతో కూడిన జల్లులు పడతాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. అయితే.. ఈ ఉపశమనం తాత్కాలికమేనని, వచ్చే వారం నుంచి ఎండల తీవ్రత మళ్లీ పెరిగే అవకాశం ఉందని, సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు అధికం కావచ్చని అధికారులు వెల్లడించారు.

# శ్రీవారి దర్శన టిక్కెట్లలో మార్పులు

- సాంకేతిక ఇబ్బందులు తొలగించిన టిటిడి



తిరుమల,మార్చి 27 : శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోవాలనుకునే భక్తుల కోసం టీటీడీ మరో కీలక నిర్ణయం తీసుకుంది. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా జారీ చేసే విరాళం ఆధారిత దర్శన టిక్కెట్ల ప్రక్రియను మరింత సరళతరం చేస్తూ బుకింగ్ విధానంలో విప్లవాత్మక మార్పులు ప్రవేశపెట్టింది. గతంలో ఈ టిక్కెట్లను బుక్ చేసుకునే సమయంలో భక్తులు ఎదుర్కొంటున్న సాంకేతిక ఇబ్బందులను, ముఖ్యంగా పేమెంట్ ప్రక్రియలో జరుగుతున్న జాప్యాన్ని నివారించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు వెల్లడించింది. దీనివల్ల భక్తులు ఎటువంటి తడబాటు లేకుండా తమ దర్శన కోటాను సులభంగా పొందే అవకాశం కలుగుతుంది. ముఖ్యంగా ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్లు బుక్ చేసుకునే భక్తుల సౌకర్యార్థం, ఇప్పుడు విరాళం , దర్శన టిక్కెట్ ధరకు సంబంధించిన మొత్తాన్ని వేర్వేరుగా కాకుండా ఒకే విడతలో చెల్లించేలా మార్పులు చేశారు. గతంలో ఉన్న సంక్లిష్టమైన పేమెంట్ విధానం వల్ల చాలామందికి ట్రాన్సాక్షన్ మధ్యలోనే ఆగిపోయేది, కానీ ఈ నూతన విధానం అమల్లోకి రావడంతో అటువంటి ఇబ్బందులు ఇకపై ఉండవు. దీనికి అదనంగా, ఒకేసారి గరిష్టంగా నలుగురు భక్తుల వరకు టిక్కెట్లను బుక్ చేసుకునే వెసులుబాటును కూడా టీటీడీ కల్పించింది. ఇది కుటుంబ సమేతంగా వచ్చే భక్తులకు ఎంతో మేలు చేకూరుస్తుంది. ప్రస్తుతం టీటీడీ ప్రతిరోజూ మొత్తం 1500 శ్రీవాణి టిక్కెట్లను జారీ చేస్తోంది. వీటిలో ఆన్‌లైన్ అడ్వాన్స్ రిజర్వేషన్ కోటాను ప్రతి మూడు నెలలకు ఒకసారి విడుదల చేస్తారు, తద్వారా భక్తులు ముందుగానే తమ ప్రయాణాన్ని ఖరారు చేసుకోవచ్చు. ఇక తక్షణమే టిక్కెట్లు కావాలనుకునే వారి కోసం ప్రతిరోజూ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో కరెంట్ బుకింగ్ సౌకర్యం అందుబాటులో ఉంటుంది. మరోవైపు, తిరుపతి విమానాశ్రయంలో కేటాయించిన 200 ఆఫ్-లైన్ టిక్కెట్ల విషయంలో మాత్రం టీటీడీ నిబంధనలను కఠినతరం చేసింది. విమానంలో వచ్చే భక్తులు తమ బోర్డింగ్ పాస్ చూపించిన తర్వాతే ఈ టిక్కెట్లను జారీ చేస్తారు. ఈ మార్పులన్నీ భక్తుల దర్శన అనుభవాన్ని మరింత మెరుగుపరుస్తాయని అధికారులు ఆశిస్తున్నారు.

## దేశంలో మరో అతిపెద్ద అంతర్జాతీయ విమానాశ్రయం



న్యూఢిల్లీ,మార్చి27 : దేశంలో మరో అతిపెద్ద అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ విమానాశ్రయం దేశ రాజధాని ప్రజలకు విమాన ప్రయాణ కష్టాలు తీరనున్నాయి. ఈ ఎయిర్‌పోర్టును ప్రధాని మోడీ శనివారం ప్రారంభించనున్నారు. ప్రస్తుతం దేశ రాజధాని ఢిల్లీలో ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం మాత్రమే ఉంది. ఒక్కోసారి కీలక సమయాల్లో ఒత్తిడిని తట్టుకోలేకపో తుంది. దీంతో ఎప్పటినుంచో మరో అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు నిర్మించాలని డిమాండ్ ఉంది. దీంతో కేంద్ర ప్రభుత్వం రూ.11,200 కోట్ల వ్యయంతో నోయిడాలోని జేవార్ ప్రాంతంలో రెండో అతిపెద్ద అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మించింది. ఈ విమానాశ్రయాన్ని పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో నిర్మించారు. 3,900 మీటర్ల పొడవైన రన్‌వే.. ఏటా 12 మిలియన్ల ప్రయాణికులు ప్రయాణం చేసేలా అత్యంత అద్భుతంగా నిర్మించారు. తాజాగా ఓపెనింగ్‌కు సిద్ధమైంది. నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం మొదటి దశ ప్రారంభం కానుంది. ప్రధాని మోడీ చేతుల మీదుగా ప్రారంభం కానుంది. అనంతరం టెర్మినల్‌ను మోడీ పరిశీలించనున్నారు. ఇక ఈ ఎయిర్‌పోర్టు ప్రారంభం కాగానే ఢిల్లీ విమానాశ్రయంలో ప్రయాణీకుల రద్దీ తగ్గి.. విమానాల సామర్థ్యం పెరుగుతుంది. మొదటి దశలో విమానాశ్రయం సంవత్సరానికి 12 మిలియన్ల (2 కోట్ల) మంది ప్రయాణికులు ప్రయాణం చేయవచ్చు. తదుపరి దశలలో ఈ సామర్థ్యాన్ని 70 మిలియన్ల (7 కోట్ల) మంది ప్రయాణికులకు విస్తరింపజేస్తారు. ఆధునిక నావిగేషన్ వ్యవస్థలు, ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్, ఆధునిక లైటింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేశారు.ఈ విమానాశ్రయం యమునా ఎక్స్‌ప్రెస్‌వే సమీపంలో ఉంది. మల్టీ-మోడల్ ట్రాన్స్‌పోర్ట్ హబ్‌గా రూపొందించారు. ఇది రోడ్డు, రైలు, మెట్రో, ఇతర ప్రాంతీయ రవాణా మార్గాల ద్వారా అద్భుతమైన కనెక్టివిటీని అందిస్తుంది. విమానాశ్రయం డిజైన్, ఘాట్‌లు, భవనాలు భారతీయ సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. అన్ని వాతావరణ పరిస్థితుల్లో 24 గంటల విమాన సర్వీసులను అందించనుంది.నేటి నుంచి రెండో అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రానుందని కేంద్ర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ప్రతిష్ఠాత్మకమైన నోయిడా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రారంభించనున్నారని ఆయన వెల్లడించారు. ఈ విషయాన్ని తెలియజేస్తున్నందుకు తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్ ప్రజలందరికీ అభినందనలు తెలిపారు. 'రేపు జేవార్ వద్ద మీ అందరినీ కలుస్తా' అంటూ రామ్మోహన్ నాయుడు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. దేశంలో విమాన ప్రయాణికుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోవడంతో ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్ర యానికి ప్రయాణికుల తాకిడి విపరీతంగా పెరిగింది. దీంతో ఈ ప్రాంతాల్లో మరో నూతన అంతర్జాతీయ ఎయిర్ పోర్టును నిర్మించాలని భావించింది. మేరకు ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం జేవార్‌లో నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేసింది. అత్యాధునిక టెక్నాలజీ, హంగులతో దీన్ని నిర్మించారు. మార్చి 28న జేవార్‌లో ప్రారంభోత్సవానికి తేదీ సైతం ఖరారు చేశారు. ఈ కొత్త విమానాశ్రయం దేశ విమానాశ్రయ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేస్తుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

## శ్రీరామనవమి శోభాయాత్ర

హైదరాబాద్, మార్చి 27: హైదరాబాద్ నగరంలో శ్రీరామ నవమి శోభాయాత్రను గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రారంభించారు. సీతారాంబాగ్ ఆలయం నుంచి సుల్తాన్ బజార్‌లోని హనుమాన్ వ్యాయామశాల వరకు ఇది కొనసాగనుంది. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడారు. ఏళ్ల తరబడి నగరంలో శ్రీరామ శోభాయాత్ర ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. భారతీయ సంస్కృతిలో రామాయణం విశిష్టమైందని.. ఆదర్శ కుమారుడు, ఆదర్శ భర్త, ఆదర్శ పురుషుడిగా శ్రీరాముడిని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఐకమత్యం, భక్తి భావనకు శోభాయాత్ర నిదర్శనంగా నిలుస్తోందని చెప్పారు. శ్రీరామ నవమి సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న రాములోరి కల్యాణాలు, శోభాయాత్రలకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. నల్లకుంటలోని పాత రామాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీపీ మాట్లాడారు. నగరంలో దాదాపు 339 ప్రాంతాల్లో శ్రీరామ నవమి సందర్భంగా కార్యక్రమాలు జరుగుతున్నాయి. సీతారాంబాగ్ నుంచి హనుమాన్ వ్యాయామశాల వరకు సాగే శోభాయాత్రకు 3వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశాం. అనుకున్న సమయానికి శోభాయాత్ర పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకున్నాం. ఇతర పండుగలకు ప్రజలు సహకరించిన విధంగానే శ్రీరామ నవమి ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసేలా అందరూ సహకరించాలని సజ్జనార్ కోరారు.

## తమిళనాడులో సీట్ల పంపకాలపై అన్నామలై అసంతృప్తి

చెన్నై,మార్చి 27 : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ-అన్నాడీఎంకే మధ్య సీట్ల పంపకాలపై బీజేపీ రాష్ట్ర శాఖ మాజీ అధ్యక్షుడు కె.అన్నామలై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని పార్టీ వర్గాల సమాచారం. సీట్ల పంపకాల ఒప్పందంలో భాగంగా బీజేపీకి కేటాయించిన నియోజకవర్గాలపైనా ఆయన ఆందోళన వ్యక్తం చేస్తూ ఢిల్లీలోని పార్టీ అధిష్ఠానానికి లేఖ రాసినట్టు ఆ వర్గాలు తెలిపాయి.బీజేపీ తేలిగ్గా గెలిచే కినితుకడవు నియోజకవర్గంతో సహా పలు నియోజకవర్గాలను అన్నాడీఎంకే కేటాయించలేదని అన్నామలై ఆ లేఖలో పేర్కొన్నట్టు తెలుస్తోంది. తమిళనాడు ఎన్నికల్లో తాను పోటీ చేసేది లేదని కూడా పార్టీ అధిష్ఠానానికి తెలియజేసినట్టు చెబుతున్నారు. సీట్ల పంపకాల ఒప్పందంపై కినితుకడవు నియోజకవర్గంలో బీజేపీ కార్యకర్తలు గురువారంనాడు నిరసన ప్రదర్శన కూడా నిర్వహించారు.తమిళనాడులో ఎన్డీయే ఇటీవల సీట్ల కేటాయింపు ఒప్పందాన్ని ఖరారు చేసింది. 169 సీట్లలో అన్నాడీఎంకే పోటీ చేయనుండగా, బీజేపీకి 27 సీట్లు కేటాయించింది. ఇతర భాగస్వామ్య పార్టీలైన పీఎంకే 18, ఏఎంఎంకే 11 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. 27 సీట్లతో బీజేపీ సంతృప్తికరంగా ఉన్నట్టు ఆపార్టీ తమిళనాడు ఇన్‌చార్జి, కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. 234 మంది సభ్యులున్న తమిళనాడు అసెంబ్లీకి ఏప్రిల్ 23న ఒకే విడతలో పోలింగ్ జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# ప్రపంచ శాంతికి బౌద్ధమే శరణ్యం



- మంత్రి జూపల్లి కృష్ణారావు
- హైదరాబాద్‌లో అంతర్జాతీయ బౌద్ధ సదస్సు...
- పలుదేశాల ప్రతినిధుల హాజరు

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రపంచవ్యాప్తంగా యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో శాంతి సాధనకు బౌద్ధ ధర్మమే మార్గమని శ్రీలంక బుద్ధ శాసన, సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి ఆచార్య హినీదుమే సునీల్ సెనేవి పేర్కొన్నారుబేగంపేట్ లోని ది ప్లాజా హోటల్‌లో బుద్ధవనం మరియు వియత్నాం బౌద్ధ సంఘం సంయుక్తంగా నిర్వహించిన ప్రపంచ శాంతిపై అంతర్జాతీయ బౌద్ధ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా హాజరై ప్రసంగించారు.

రాష్ట్రంలో బౌద్ధ పర్యాటక వలయాన్ని అభివృద్ధి చేసి, బుద్ధవనాన్ని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జూపల్లి తెలిపారు. బుద్ధుని బోధనలు ఆచరిస్తే సమాజంలో శాంతి నెలకొంటుందని పేర్కొన్నారు. వియత్నాం బౌద్ధ సంఘ అధ్యక్షుడు తిచ్ నాత్ తు మాట్లాడుతూ, శాంతి వ్యక్తుల మనసులో ప్రారంభమై సమాజానికి వ్యాపిస్తుందని అన్నారు.

నవనలంద మహా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య సిద్ధార్థ సింగ్ కీలకోపన్యాసం చేస్తూ, సత్సంకల్పాలు మరియు మంచి చర్యలు సమాజాభివృద్ధికి దోహదం చేస్తాయని వివరించారు. ఈ సదస్సులో శ్రీలంక, రష్యా, లావోస్ తదితర దేశాలకు చెందిన బౌద్ధ ప్రతినిధులు ప్రసంగించారు. బౌద్ధ సంస్కృతి పరిరక్షణకు చేసిన సేవలకు గుర్తింపుగా పలువురికి అంతర్జాతీయ అవార్డులు ప్రదానం చేశారు. బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ, 22 దేశాల నుంచి 80 మంది ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారని తెలిపారు.

# సిర్సనగండ్లలో ఘనంగా సీతారాముల కల్యాణోత్సవం

- స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి జూపల్లి...

**భారీగా తరలివచ్చిన భక్తజనం**



**బలగం టీవీ, హైదరాబాద్**

సిర్సనగండ్లలోని చారిత్రాత్మక పుణ్యక్షేత్రంలో శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. లోకక్షేమం కోసం నిర్వహించిన ఈ పవిత్ర కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన అతిథులకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకులు శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. ఈ వేడుకను దర్శించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. “జై శ్రీరామ్” నినాదాలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. పూజా కార్యక్రమాల అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, సిర్సనగండ్ల క్షేత్రానికి ఉన్న విశిష్టతను కాపాడుతూ భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఈ పుణ్యక్షేత్రాన్ని పర్యాటక పరంగా అభివృద్ధి చేసి “దక్షిణ అయోధ్య”గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.

# పాకిస్థాన్‌కు ఇరాన్ షాక్... చమురు నౌక ధ్వంసం



**బలగం టీవీ, హైదరాబాద్**

ఇరాన్ పాకిస్థాన్‌కు ఊహించని షాక్ ఇచ్చింది. టెహ్రాన్ అనుమతి లేకుండా హర్మూజ్ జలసంధి దాటుతున్న పాకిస్థాన్కు చెందిన చమురు నౌకను ధ్వంసం చేసినట్లు సమాచారం. ఈ ఘటన పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను మరింత పెంచింది. పశ్చిమాసియా ప్రాంతంలో యుద్ధ పరిస్థితులు కొనసాగుతున్న వేళ, ఇరాన్ చర్చలకు సిద్ధంగా లేదని సంకేతాలు ఇస్తోంది. డొనాల్డ్ ట్రంప్ చర్చలపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చినా, టెహ్రాన్ దాడులపై వెనక్కి తగ్గడం లేదు. మరోవైపు ఇజ్రాయెల్ పై దాడులు కొనసాగుతుండగా, అమెరికా జోక్యం ఉంటే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని హెచ్చరికలు జారీ చేసింది.

దుబాయ్, అబుదాబీ సముద్ర తీర ప్రాంతాల సమీపంలో ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది. కొన్ని రోజుల క్రితం కూడా హర్మూజ్ జలసంధిలో పాకిస్థాన్‌కు చెందిన నౌకను ఇరాన్ అడ్డుకుంది. అనుమతి లేకుండా ప్రయాణించడానికి ప్రయత్నించడంతో ఆ నౌకను నిలిపివేసినట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ వెల్లడించింది. ఇప్పటికే మరో పాక్ చమురు నౌకపై దాడి చేసి ధ్వంసం చేయడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది.

ఇరాన్‌తో తమకు సత్సంబంధాలు ఉన్నాయని, యుద్ధానికి మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధమని పాకిస్థాన్ ఇటీవల ప్రకటించింది. ఈ నేపథ్యంలో పాక్‌కు చెందిన నౌకపై దాడి జరగడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. ఇదిలా ఉండగా, భారత్‌కు చెందిన నౌకలకు హర్మూజ్ జలసంధి దాటేందుకు ఇరాన్ అనుమతులు ఇస్తున్నట్లు సమాచారం. ఈ పరిణామాలు ప్రాంతీయ భద్రతపై ప్రభావం చూపే అవకాశముంది.

# స్నానం చేస్తుండగా వీడియోలు తీసి వేధింపులు..

- వ్యక్తికి 10 ఏళ్ల జైలు శిక్ష

**బలగం టీవీ, హైదరాబాద్**

జగిత్యాల జోన్‌లో సంచలనంగా మారిన కేసులో నిందితుడికి కోర్టు కఠిన శిక్ష విధించింది. ఓ వివాహితను బ్లాక్‌మెయిల్ చేసి శారీరకంగా వేధించిన నిందితుడు నరేండ్ల మహేందర్‌కు పదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.6,600 జరిమానా విధిస్తూ మొదటి అదనపు జిల్లా జడ్జి సుగళి నారాయణ తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బిట్ల నర్సయ్య వివరాల ప్రకారం, గొల్లపల్లి మండలంకు చెందిన మహిళను దండేపల్లి మండలంలోని వ్యక్తికి వివాహం చేశారు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

భర్తకు స్నేహితుడైన నర్సాపూర్కు చెందిన నరేండ్ల మహేందర్ తరచూ వారి ఇంటికి వెళ్లేవాడు. ఒకసారి మహిళ స్నానం చేస్తున్న సమయంలో ఆమెను చాటుగా వీడియో తీసి, ఆమె భర్తకు తప్పుగా చెప్పి కుటుంబంలో కలహాలు సృష్టించాడు. దీంతో బాధితురాలు పుట్టింటికి వెళ్లగా, ఆ వీడియోలను సోషల్ మీడియాలో పెడతానని బెదిరిస్తూ ఆమెను శారీరకంగా వేధించాడు. 2022 ఏప్రిల్ 19న కూడా వీడియోలు తొలగిస్తానని చెప్పి మళ్లీ దుర్వినియోగానికి పాల్పడ్డాడు. తాను అడిగినప్పుడల్లా కోరిక తీర్చాల్సిందేనని బెదిరింపులకు దిగాడు.

బాధితురాలు ధైర్యంగా ముందుకు వచ్చి గొల్లపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. అప్పటి ధర్మపురి సీఐ బిల్లా కోటేశ్వర్ దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టులో సాక్ష్యాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం నిందితుడి నేరం రుజువవడంతో పదేళ్ల జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. ఈ కేసు బాధితులకు న్యాయం జరిగిందని అధికారులు తెలిపారు.

# లారీని ఢీకొట్టిన పికప్ వాహనం..



- 8 మంది మృతి, 27 మందికి గాయాలు
- మృతుల్లో ముగ్గురు పిల్లలు, ఐదుగురు మహిళలు...
- డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమా?

**బలగం టీవీ, హైదరాబాద్**

కౌశాంబి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు పక్కన నిలిచి ఉన్న లారీని పికప్ వాహనం ఢీకొట్టడంతో ముగ్గురు పిల్లలతో సహా మొత్తం 8 మంది మృతి చెందగా, మరో 27 మంది గాయపడ్డారు.

పోలీసుల వివరాల ప్రకారం, ఒక గ్రామానికి చెందిన పలు కుటుంబాలు ప్రయాగ్‌రాజ్లో జరిగిన తలనీలాల సమర్పణ కార్యక్రమానికి హాజరై తిరుగు ప్రయాణం చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. శుక్రవారం కౌశాంబి జాతీయ రహదారిపై దోర్మా గ్రామం సమీపంలో వేగంగా వెళ్తున్న పికప్ వాహనం నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కన నిలిచిన లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మహిళలు, ముగ్గురు పిల్లలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

పికప్ వాహనం డ్రైవర్ నిద్ర మత్తులో ఉండటం వల్లే ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ప్రమాదంతో ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది. ఒకే గ్రామానికి చెందిన కుటుంబాలపై ఈ ఘటన తీవ్ర ప్రభావం చూపింది.

# అన్నా యూనివర్సిటీలో లైంగిక వేధింపుల కలకలం






- విద్యార్థిని ఫిర్యాదుతో వెలుగులోకి ఘటన...
- క్యాంపస్‌లో విద్యార్థుల ఆందోళనలు
- ప్రొఫెసర్ అరెస్ట్...

**బలగం టీవీ, హైదరాబాద్**

అన్నా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు రావడంతో తీవ్ర కలకలం రేగింది. బాధిత విద్యార్థిని ఫిర్యాదు మేరకు ప్రొఫెసర్ జ్ఞానవేల్ బాబును పోలీసులు అరెస్ట్ చేశారు. కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థిని, రెండో సంవత్సరంలో ఉన్నప్పటి నుంచి ఇంటర్న్‌షిప్ సహాయం చేస్తానని నెపంతో ప్రొఫెసర్ తనను వేధించడం ప్రారంభించాడని ఆరోపించింది. మూడేళ్లుగా ఫోన్ కాల్స్, అశ్లీల సందేశాలు, వ్యక్తిగతంగా అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు పాల్పడినట్లు తన ఫిర్యాదులో పేర్కొంది. ఫోన్‌లో బ్లాక్ చేసినా, ఇతరుల ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించాడని తెలిపింది.

ఈ ఘటన వెలుగులోకి రావడంతో శుక్రవారం విద్యార్థులు క్యాంపస్‌లో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ప్రొఫెసర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, స్వతంత్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) నేతలు మాట్లాడుతూ బాధితురాలికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

విద్యార్థినులు తమ అకడమిక్ భవిష్యత్తుపై ప్రభావం పడుతుందనే భయంతో ఇలాంటి ఘటనలను బయటపెట్టడానికి వెనుకాడుతున్నారని పలువురు అభిప్రాయపడ్డారు.

బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. యూనివర్సిటీ యాజమాన్యం కూడా అతడిని సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఘటనపై రాష్ట్రంలో మహిళలపై నేరాలు పెరుగుతున్నాయని పేర్కొంటూ విపక్షాలు ద్రవిడ మున్నేట్ర కళగం ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నాయి.

# కేంద్రం, ఈసీపై మమతా బెనర్జీ ఘాటు విమర్శలు

- ఎల్పీజీ సంక్షోభంపై ఆందోళన...
- ఓటర్ల జాబితా తొలగింపులపై సంచలన ఆరోపణలు


**బలగం టీవీ, హైదరాబాద్**



పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం (ఈసీ) తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ఎల్పీజీ సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో, ఇక్కడ ఉత్పత్తి అవుతున్న గ్యాస్‌ను ఇతర రాష్ట్రాలకు తరలించవద్దని డిమాండ్ చేశారు. కోల్‌కతా విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడిన మమత, ఎన్నికల ముందు అధికారులు, పోలీసులను బదిలీ చేయడం వల్ల రాష్ట్రానికి చెందిన వనరులు ఇతర ప్రాంతాలకు మళ్లే ప్రమాదం ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల కోసం భారీగా కేంద్ర బలగాలు, సిబ్బంది రానున్న నేపథ్యంలో గ్యాస్ అవసరాలు పెరుగుతాయని, దీనివల్ల స్థానిక ప్రజలు ఇబ్బందులు పడే అవకాశముందని పేర్కొన్నారు.

ఓటర్ల జాబితా అంశంపై కూడా మమత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అనుబంధ జాబితాను విడుదల చేశామని ఈసీ చెబుతున్నప్పటికీ, ఇప్పటివరకు హార్డ్ కాపీలు అందలేదని ఆరోపించారు. “ఇది ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడమే. జాబితాను పారదర్శకంగా విడుదల చేసి, ప్రజలకు స్పష్టత ఇవ్వాలి” అని ఆమె డిమాండ్ చేశారు. పేర్ల తొలగింపులపై ప్రజలు తమ హక్కులను రక్షించుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.ప్రతి జిల్లాలో ఓటర్ల జాబితా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని మమత సూచించారు. “ఈ దేశం ఏమైనా భారతీయ జనతా పార్టీ వ్యక్తిగత ఆస్తి కాదు” అంటూ కేంద్రంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం నెలకొన్న సమయంలో ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. కేంద్రం, ఈసీ తీరుపై మమత చేసిన ఆరోపణలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

# మహారాష్ట్రలో మంత్రి వీడియో వివాదం...



**బలగం టీవీ, ముంబై**

మహారాష్ట్ర రాజకీయాల్లో కొత్త వివాదం చెలరేగింది. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) నేత, రాష్ట్ర ఆహార మరియు ఔషధాల నియంత్రణ శాఖ మంత్రి నరహరి జిర్వాల్కు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో చర్చనీయాంశమైంది. ఈ వీడియోపై మంత్రి సోదరుడు, ఎన్సీపీ నేత రవి యాదవ్ స్పందిస్తూ, ఇది రాజకీయ కుట్రలో భాగమని ఆరోపించారు. ట్రాన్స్‌జెండర్‌ను ఉపయోగించి వీడియోలు చిత్రీకరించి, కీలక పదవుల కోసం బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని పేర్కొన్నారు.

ఈ ఘటనపై కాంగ్రెస్ నేత, సామాజిక కార్యకర్త అంజలి దమనియా తీవ్రంగా స్పందించారు. ఇలాంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని పదవిలో కొనసాగించడం సరికాదని విమర్శించారు.మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు హర్షవర్ధన్ సక్పాల్ కూడా ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. అయితే ఎన్సీపీ నేత అమోల్ మిత్కరి ఈ వీడియోను పూర్తిగా రాజకీయ కుట్రగా అభివర్ణించారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం వీడియో బయటకు రావడం అనుమానాస్పదమని తెలిపారు.

జిర్వాల్‌పై గతంలో కూడా అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఆయన కార్యాలయంలో పనిచేసే ఒక ఉద్యోగి లంచం కేసులో పట్టుబడటం చర్చనీయాంశమైంది. ఇటీవల అజిత్ పవార్ మరణానంతరం పార్టీ అంతర్గత పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో ఈ వివాదం వెలుగులోకి రావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఎన్సీపీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన సునేత్రా పవార్ పదవిలోకి వచ్చిన కొద్దికాలానికే ఈ ఘటన చోటుచేసుకోవడం పార్టీకి ఇబ్బందికరంగా మారింది. పార్టీ లోపల నుంచి కూడా జిర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఈ వివాదం నేపథ్యంలో మహారాష్ట్ర రాజకీయాల్లో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.

# ఘనంగా శ్రీరామ నవమి శోభాయాత్ర

**సీతారాంబాగ్ నుంచి ప్రారంభమైన శోభాయాత్ర... కళారూపాలు, భక్తి నినాదాలతో అలరించిన వేడుక**



**బలగం టీవీ, హైదరాబాద్**

శ్రీరామ నవమి సందర్భంగా హైదరాబాద్‌లో శ్రీరాముల శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. సీతారాంబాగ్ ద్రౌపది గార్డెన్ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర భక్తి భావంతో నిండిన వాతావరణంలో కొనసాగింది. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా శోభాయాత్రను ప్రారంభించారు. సీతారాంబాగ్ నుంచి మంగళహాట్, పురాణాపూల్, జుమ్మెరత్ బజార్, బేగంబజార్, సిద్ధంబార్ బజార్ మీదుగా హనుమాన్ వ్యాయామశాల వరకు యాత్ర కన్నుల పండుగగా సాగింది. పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో మార్గాలు జనసంద్రమయ్యాయి. “జై శ్రీరామ్” నినాదాలతో ప్రాంతం మారుమోగింది. యాత్రలో నిర్వహించిన వివిధ కళారూపాలు, ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మార్గమధ్యంలో అనేక ప్రాంతాల్లో భక్తులకు స్వాగతం పలికారు.

మంగళహాట్, పురాణాపూల్, జుమ్మెరత్ బజార్ ప్రాంతాల్లో ఇరుకైన రహదారులు ఉండటంతో పాటు భారీ వాహనాల రాకపోకల కారణంగా శోభాయాత్ర కొంత ఆలస్యంగా కొనసాగింది. ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీసులు వాహనాలను మళ్లించారు.

**భద్రతా ఏర్పాట్లు**

శోభాయాత్ర నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ భద్రతా ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. యాత్ర ప్రశాంతంగా సాగేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

డ్రోన్లు, సీసీటీవీ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. దాదాపు 3 వేల మంది సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు కల్పించారు. యాత్ర మధ్యాహ్నం ప్రారంభమై రాత్రి వరకు కొనసాగేందుకు ప్రత్యేక రూట్ మ్యాప్ సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్తో కలిసి శ్రీ సీతారామచంద్ర స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో గ్యాస్ సిలిండర్లకు కొరతలేదు



- ప్రజల అవసరాలకు అనుగుణంగా నిలువలు ఉన్నాయి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గ్యాస్ సిలిండర్లకు కొరత లేదని కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా జిల్లాలో సిలిండర్ల నిల్వలు ఉన్నాయని తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి అపోహలు పడవద్దని, వదంతులు నమ్మవద్దని సూచించారు. గృహ వినియోగదారులు తొందరపడి గ్యాస్ బుక్ చేసుకోవద్దని తెలిపారు. తమ అవసరాలకు అనుగుణంగా గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. గ్యాస్ సిలిండర్ పక్కదారి పట్టినా.. బ్లాక్ దందా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎల్పీజీ గ్యాస్ సరఫరా విషయమై జిల్లాలో కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలో ఎల్పీజీ గ్యాస్‌కు సంబంధించిన సమస్యలు ఎదురైతే వినియోగదారులు 80084 29738 ఫోన్ నంబర్‌కు సంప్రదించి తమ ఫిర్యాదులను తెలియ జేయవచ్చని పేర్కొన్నారు.

ఎల్పీజీ గ్యాస్ సరఫరా, పంపిణీకి సంబంధించిన సమస్యలను పర్యవేక్షించడంతోపాటు వినియోగదారుల ఫిర్యాదులను స్వీకరించి, పరిష్కరించే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కంట్రోల్ రూమ్‌లో నమోదు అయ్యే ఫిర్యాదులను సంబంధిత అధికారులు, ఎల్పీజీ గ్యాస్ ఏజెన్సీలకు తెలియజేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు.



## ఓమౌజయా క్షేత్రంలో ఎన్నారై రాధారపు సత్యం ప్రత్యేక పూజలు

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ శివారులోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం ఓమౌజయా క్షేత్రాన్ని ప్రముఖ ఎన్నారై, సామాజిక సేవకుడు రాధారపు సత్యం సందర్శించారు. శుక్రవారం క్షేత్రానికి చేరుకున్న ఆయనకు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు.

ఓమౌజయా క్షేత్రంలోని శక్తి పీఠాన్ని దర్శించుకున్న సత్యం, అక్కడ కొనసాగుతున్న 24 గంటల యజ్ఞ హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం క్షేత్రంలోని పరబ్రహ్మ మందిరాన్ని సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా క్షేత్ర నిర్వాహకులు వారికి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధారపు సత్యంతో పాటు ఎల్లారెడ్డిపేట మండల మున్నూరు కాపు సంఘం మాజీ అధ్యక్షులు నంది కిషన్, ఎన్నారై మర్రి తిరుపతి, శ్రీకాంత్, మక్కా మల్లేశం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్షేత్రంలోని ఆధ్యాత్మిక వాతావరణం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.



## శ్రీరామ నవమి కానుకగా చారిత్రక నిర్ణయం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు
- పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్

**బలగం టీవి, హైదరాబాద్**



శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చమురు ధరలపై తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగుతున్నప్పటికీ సామాన్య, మధ్యతరగతి ప్రజల ప్రయోజనాల దృష్ట్యా కేంద్రం ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించడం సాహసోపేత నిర్ణయమని అన్నారు.

డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని సున్నా స్థాయికి తగ్గించడం ప్రధాని నరేంద్ర మోదీ పరిపాలనా దక్షతకు నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే పెట్రోల్‌పై కూడా కేంద్రం రూ.10 మేర భారాన్ని తగ్గించి తన బాధ్యతను చాటుకుందని తెలిపారు.

ప్రస్తుతం తెలంగాణలో వ్యాట్ సుమారు 35 శాతం ఉండటం వల్ల ప్రజలపై అధిక భారం పడుతోందని ఆయన విమర్శించారు. కేంద్రం పన్నులు తగ్గిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తన పన్ను వాటాను తగ్గించడంలో ముందుకు రావడం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ తగ్గించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం కూడా పన్ను వాటాను తగ్గిస్తేనే పెట్రోల్ ధర రూ.100 లోపుకు వచ్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సామాన్య ప్రజలకు నిజమైన ఊరటనివ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# అసెంబ్లీలో రవాణాశాఖ మంత్రి చెప్పేవన్నీ అబద్ధాలే

- టీజేఎస్ఆర్టీసి జేఏసీ

**బలగం టీవీ, హైదరాబాద్**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాల కాలంలో 7 సార్లు జరిగిన అసెంబ్లీ సమావేశాలలో మంత్రి ఆర్టీసి సమస్యలపై ప్రతిపక్ష సభ్యులడిగిన ప్రశ్నలకు ఒకే రకమైన సమాధానం రిపీట్ చేస్తూ కార్మిక సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని టిజిఎస్ ఆర్టీసి జెఎసి ఛైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి.మౌలానా, కో-కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరి అన్నారు. ఆర్టీసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడం గురించి గత బిఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి, గవర్నర్ తో గెజిట్ పబ్లిష్ చేసినప్పటికీ ఈ ప్రభుత్వం ఇప్పటివరకు విలీనం గురించి తీసుకున్న చర్యలు శూన్యమని అన్నారు. మంత్రి సభలో మాట్లాడుతూ విలీనం గురించి కమిటీ వేసినాము, ఈ అంశం కమిటీ పరిశీలనలో ఉన్నదని, తప్పుడు సమాధానం చెప్పడం సరికాదని, ఈ ప్రభుత్వం కమిటీ ఎప్పుడు వేసింది, దానికి ఎవరు నాయకత్వం వహిస్తున్నారో, ఎవరు సభ్యులో మంత్రి బహిర్గతం చేయాలని జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. అలాగే ఆర్టీసిలో కారుణ్య నియామకాలనేవి చనిపోయిన వారి స్థానంలో ఇచ్చేవని, వాటిని ఈ ప్రభుత్వం కొత్త నియామకాలుగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. ప్రభుత్వంపై గాని, యాజమాన్యంపై గాని ఒక్క రూపాయ కూడా ఖర్చు లేని యూనియన్ల పునరుద్ధరణ అంశం మరియు విలీనం అశం ఈ రెండూ ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని పదే పదే చెప్తున్న మంత్రి, ఇప్పుడున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం కాదా? ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జరిగే కేబినెట్ సమావేశాలలో మాట్లాడే మంత్రులు కాంగ్రెస్ వారు కాదా? ఈ రెండు అంశాలను చర్చించడానికి రెండున్నర సంవత్సరాలు సరిపోలేదా అని ప్రశ్నించారు. మాటి మాటికీ ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సులను తీసుకొస్తున్నామని చెప్తున్న ప్రభుత్వం ఆర్టీసి కార్మికుల సూచనలను, ఆవేదనను అర్థం చేసుకోకుండా బలవంతంగా ఎలక్ట్రిక్ బస్సులను వేలాదిగా తెచ్చి ఆర్టీసి ఉనికి లేకుండా చేయడం వెంటనే మానుకోవాలని, అలాగే ఆర్టీసి డిపోలను, స్థలాలను వారికి ధారాదత్తం చేయడం ఆపాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజులలో జెఎసి ఆధ్వర్యంలో "ఎలక్ట్రిక్ బస్సులు గోబ్యాక్" అనే నినాదంతో వాటిని అడ్డుకుంటామని హెచ్చరించారు. లేబర్ కమిషనర్ జెఎసి సమ్మె నోటీసుకు స్పందించి 25-03-2026 నాడు కన్సిలేషన్ మీటింగ్ చర్చలకు రావాలని అందరికీ లెటర్స్ పంపి, అకారణంగా అసెంబ్లీ సాకుతో చర్చలను వాయిదా వేయడాన్ని జెఎసి తీవ్రంగా ఖండిస్తోందన్నారు. 20-03-2026న కూడా అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న విషయం లేబర్ డిపార్టుమెంట్ కు తెలిసి కూడా చర్చలకు సమయమిచ్చి, అదే సమావేశాల సాకు చూపి చర్చలను వాయిదా వేయడం చూస్తే ఉద్దేశపూర్వకంగా చేసిన చర్యగా జెఎసి భావిస్తోందన్నారు. కార్మిక శాఖ అనేది కార్మికవర్గానికి పారదర్శకంగా ఉండాలి కాని, ఇతరుల ప్రోద్బలంతో కార్మికగవర్గంపై వివక్ష చూపడం సరి కాదని అన్నారు. ఇప్పటికైనా వెంటనే అసెంబ్లీ సమావేశాలు ముగిసే లోపు జెఎసికి కన్సిలేషన్ మీటింగ్ ఏర్పాటు చేయాలని కోరుతూ జాయింట్ లేబర్ కమిషనర్ శ్రీమతి సునీత గోపాల్ దాస్ గారికి జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో జెఎసి కోశాధికారి బి.యాదయ్య, ఎ.ఆర్.రెడ్డి, జె.రాఘవులు, ఎన్.కమలాకర్ గౌడ్, కా.సత్యం, బుద్ధ విశాల్ జి.రాములు,ఎ శ్రీనివాస్,రాంచందర్, ఖరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో శ్రీరామనవమి సంబరాలు

- స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్...

**బలగం టీవీ, వేములవాడ:**

శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని వేములవాడలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ మరియు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శుక్రవారం సమర్పించారు.

ముందుగా ఆలయ అతిథి గృహానికి చేరుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితే పుష్పగుచ్ఛాలు అందజేసి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం వారు భీమేశ్వర స్వామి ఆలయానికి చేరుకోగా, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతించారు.

సీతారాముల కల్యాణ వేడుకల కోసం రాజరాజేశ్వర ఆలయ ఆధ్వర్యంలో శివార్చన స్టేజీ వద్ద ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ భీమేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పట్టువస్త్రాలను సమర్పించారు. అర్చకులు వారికి వేద మంత్రాలతో ఆశీర్వచనం అందజేసి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.



ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ శేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాకేష్, ఆర్డీవో రాధాబాయి, ఆలయ ఈఓ రమాదేవి, డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్ జయంత్ కుమార్ మరియు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలి..

- సమృద్ధిగా వర్షాలు పడాలి, పంటలు పండాలి
- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

శ్రీ సీతారాముల ఆశీస్సులతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు పడాలి, పంటలు పండాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. శ్రీ రామ నవమి సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వద్ద ఉన్న శివార్చన స్టేజి వద్ద శ్రీ సీతారాముల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, తలంబ్రాలు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ శ్రీ సీతారాముల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించామని తెలిపారు. శ్రీ సీతారాముల ఆశీస్సులతో రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలన్నారు.



### వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణం : ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వద్ద ఉన్న శివార్చన స్టేజీ వద్ద శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ఆయన మాట్లాడుతూ వేములవాడలో శ్రీ సీతారాముల కల్యాణం సంప్రదాయంగా వస్తుందని వివరించారు. కల్యాణానికి 50వేల భక్తులు వస్తారనే అంచనా మేరకు అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు . పందిళ్లు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయించామని పేర్కొన్నారు. నూతన వేదిక వద్ద శ్రీ శివ, శ్రీ సీతారాముల కల్యాణం వేడుకలు దేవాదాయ శాఖ ఆద్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు అవుతున్నాయని వివరించారు. శ్రీ సీతారాముల ఆశీస్సులు రాష్ట్ర ప్రభుత్వం, ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు.



# కమణీయం రాములోరి కళ్యాణం



- అనంతారం లో కన్నుల పండుగగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం

**బలగం, టీవీ ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండలంలోని పలు గ్రామాల్లో శ్రీ రమనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ సీత రాముల కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా అంగారంగా వైభవం గా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అనంతారం గ్రామంలో శ్రీ సీతారామ చంద్రుల ప్రతిమలు భద్రాద్రి రామాలయం లో మాదిరిగానే ఇక్కడి గ్రామ దేవాలయం లో ఉండడంతో గ్రామస్తులు అదృష్టం గా కొలుస్తారు. దేవాలయన్ని చక్కగా అలంకరణ చేసి, పుస్తె మట్టెలు, పట్టు వస్త్రాలు, ఎదుర్కోలు కార్యక్రమలు స్థానిక సర్పంచ్ వొల్లాల రజిత వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రాల నడుమ శ్రీ రాములోరి కళ్యాణం కమనీయంగా జరిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నదాన కార్యక్రమం నిర్వహించి అన్ని సౌకర్యాలు కల్పించారు. ఈ కార్యక్రమం లో పండితులు శేషం మురళి మోహనచర్య, శ్రీ హర్ష, శ్రీ చక్ర గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు హనుమాన్ మాలధారణ స్వాములు తదితరులు పాల్గొన్నారు

# ప్రత్యేక పూజలు నిర్వహించిన కేటీఆర్

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

శ్రీరామనవమి సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని హనుమాన్ ఆలయం (మూడు గుడులు)లో నిర్వహించిన సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులతో కలిసి కల్యాణోత్సవాలను వీక్షించారు. రాములోరి కల్యాణోత్సవాలకు హాజరైన కేటీఆర్‌కు స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు.



# పలు గ్రామాల్లో సీతారామ కళ్యాణోత్సవాలు



- రాష్ట్ర మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక పూజలు

**బలగం టీవీ, ధర్మారం**

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం శ్రీరామనవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ధర్మారం, ఖిలావనపర్తి, కమ్మర్ ఖాన్‌పేట, బుచ్చయ్యపల్లి గ్రామాల్లోని శ్రీరామాలయాల్లో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు.ధర్మారం గ్రామంలో ఆలయ నిర్వాహకులు, ధర్మకర్తలు పూస్కురు పద్మజ--జితేందర్‌రావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించగా, ఖిలావనపర్తి గ్రామంలో ఆలయ కమిటీ చైర్మన్ మెట్టుపల్లి అశోక్‌రావు ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో వేద పండితులు సీతారాముల కళ్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ధర్మారంలో జరిగిన కార్యక్రమాలకు రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ధర్మకర్తలు పద్మజ--జితేందర్‌రావు ఆయనను సన్మానించారు. ఖిలావనపర్తి గ్రామంలో నిర్వహించిన వేడుకలకు నందిమేడారం ప్యాక్స్ మాజీ చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ధర్మపురి మండలం దొంతపూర్ గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహించిన కళ్యాణోత్సవాల్లో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులతో కలిసి స్వామివారి కళ్యాణాన్ని వీక్షించి ఆశీస్సులు పొందారు. గ్రామ ప్రజలు మంత్రికి ఘన స్వాగతం పలికి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రూ.138 కోట్ల

# అక్రమ లావాదేవీలు సాగించిన సైబర్ క్రైమ్ ముఠా




- కరీంనగర్‌లో భారీ 'మ్యూల్ అకౌంట్ల' ముఠా గుట్టురట్టు
- ఆర్‌బీఎల్ బ్యాంక్ మేనేజర్ సహా 13 మంది అరెస్ట్
- వివరాలు వెల్లడించిన కరీంనగర్ సీపీ గౌస్ ఆలం

**బలగం టీవీ, హైదరాబాద్**

కమీషన్ల ఆశ చూపి సామాన్యుల పేర్లతో బ్యాంక్ అకౌంట్లు తెరిపించడం.. ఆపై ఆ ఖాతాల ద్వారా సైబర్ మోసాల సొమ్మును విదేశాలకు మళ్లించి భారీ కుంభకోణానికి తెరలేపారు. ఈ ఘరానా మ్యూల్ అకౌంట్ల నెట్‌వర్క్‌పై కరీంనగర్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. రత్నాకర్ బ్యాంక్ లిమిటెడ్(ఆర్‌బీఎల్) మేనేజర్ సహకారంతో ఏకంగా రూ.138 కోట్ల అక్రమ లావాదేవీలు సాగించిన సైబర్ క్రైమ్ ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. సైబర్ నేరాలకు కేంద్ర బిందువుగా మారుతున్న 'మ్యూల్ బ్యాంక్ ఖాతాల'పై కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కొరడా ఝులిపించింది. శుక్రవారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఈ భారీ కుంభకోణానికి సంబంధించిన విస్తుపోయే నిజాలను వెల్లడించారు.

దేశవ్యాప్తంగా సైబర్ మోసాలకు పాల్పడే ముఠాలకు సహకరిస్తున్న స్థానిక నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు పోలీసులు 'ఆపరేషన్ క్రాక్‌డౌన్ 1.0'ను ప్రారంభించారు. ఈ దర్యాప్తులో మొత్తం 24 మంది నిందితులను గుర్తించగా, వారిలో 13 మందిని శనివారం రిమాండ్‌కు తరలించారు.

ప్రజల సొమ్ముకు రక్షణ కల్పించాల్సిన బ్యాంకు అధికారులే నేరస్థులతో కుమ్మక్కయ్యారు. హన్మకొండకు చెందిన ఆర్‌బీఎల్ బ్యాంక్ మేనేజర్ భువనగిరి కళ్యాణ్, కరీంనగర్‌కు చెందిన మరో బ్యాంక్ ఉద్యోగిని అయేషా బేగం నేరుగా ఈ ముఠాకు సహకరించినట్టు పోలీసులు గుర్తించారు. నిందితులు మూడు అంచెలుగా ఈ సైబర్ దందాను నడిపిస్తున్నారు. కొందరు సమన్వయకర్తలు మ్యూల్ ఖాతాల ఏర్పాటును దగ్గరుండి పర్యవేక్షిస్తారు. మధ్యవర్తులు సామాన్య ప్రజలను టార్గెట్ చేసి, వారికి కొంత కమీషన్ ఆశ చూపి బ్యాంక్ ఖాతాలు తెరిపిస్తారు. ఖాతాదారులు కొద్దిపాటి డబ్బు కోసం ఆశపడి తమ వ్యక్తిగత ఖాతాలను, లాగిన్ వివరాలను నేరగాళ్లకు అప్పగిస్తారు. ఈ విధంగా సేకరించిన ఖాతాల ద్వారా సైబర్ నేరగాళ్లు తాము మోసగించిన డబ్బును విదేశాలకు సులువుగా మళ్లించేవారని సీపీ గౌస్ ఆలం వివరించారు.

పోలీసుల ప్రాథమిక విచారణలో ఈ ముఠా చేసిన ఆర్థిక లావాదేవీల గణాంకాలు దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. వర్చువల్ ఖాతాల ద్వారా రూ.12,25,31,665, అలాగే బ్యాంక్ మ్యూల్ ఖాతాల ద్వారా రూ. 125,80,71,688.. మొత్తంగా సుమారు రూ.138 కోట్లకు పైగా లావాదేవీలు జరిగినట్టు గుర్తించారు.

ఈ వ్యవహారంపై భారత న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్లు 112, 318(4), ఐటీ యాక్ట్ సెక్షన్ 66–డీ కింద మొత్తం 8 కేసులను పోలీసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో ముఖ్య నిందితులు (సమన్వయకర్తలు/మధ్యవర్తులు) బండారి సాయిరాం (వెల్గటూర్, జగిత్యాలజిల్లా), అనుమాండ్ల రంజిత్ (బుగ్గారం, జగిత్యాల జిల్లా), అలిగేటి మల్లేశం (ధర్మారం, పెద్దపల్లి జిల్లా, బోగ రాకేష్ (జగిత్యాల జిల్లా), బండి ప్రణయ్ (రామడుగు, కరీంనగర్ జిల్లా), ఈ నేరానికి సహకరించిన బ్యాంకు అధికారులు హన్మకొండకు చెందిన ఆర్‌బీఎల్ బ్యాంకు మేనేజర్ భువనగిరి కళ్యాణ్‌ను రిమాండ్‌కు తరలించారు. ఇందులో బ్యాంక్ ఉద్యోగి అయేషా బేగం నాలుగు నెలల గర్భవతి కావడంతో ఆమెను అరెస్టు చేయలేదు.

# పెండ్లి రద్దయ్యిందని యువకుడు ఆత్మహత్య

**బలగం టీవీ, వెల్దుర్తి**



నిశ్చితార్థం జరిగి పెండ్లి క్యాన్సల్ కావడంతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం ఏదులపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఏదులపల్లికి చెందిన దాసరి విజయ్ (24)కి కొద్దిరోజుల క్రితం తమ బంధువుల అమ్మాయితో పెండ్లి సంబంధం కుదిరి నిశ్చితార్థం జరిగింది. కానీ పెండ్లి క్యాన్సిల్ అయింది. దాంతో మనస్థాపానికి గురైన విజయ్ గురువారం మధ్యాహ్నం తమ వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబీకులు, గ్రామస్తులు విజయ్‌ని చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ విజయ్ శుక్రవారం మృతిచెందారు. మృతునికి సోదరుడు ఉన్నారు. విజయ్ మృతితో ఏద్దులపల్లిలో విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల రోదనలు మిన్నంటాయి.

# ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి ఆత్మహత్య

**బలగం టీవీ, హైదరాబాద్**

బీటెక్ చదువుతున్న విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్‌లో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా నందిగూడెం మండలం శ్రీరంగపురం గ్రామానికి చెందిన కందిమల్ల నాగేశ్వరరావు కుమారుడు సాయి(20) ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రంలోని దివ్య హాస్టల్‌లో ఉంటూ గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం హాస్టల్ గదిలోని రూమ్‌లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అయితే ఆత్మహత్యకు గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

# నేటి నుంచి శాసన సభ్యుల క్రీడోత్సవాలు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఎల్బీ స్టేడియంలో ప్రారంభం కాబోతున్న శాసనసభ్యుల క్రీడోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివసేనా రెడ్డి తెలిపారు. ఈ నెల 28వ తేదీ (శనివారం) హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ప్రారంభం కానున్న ఫస్ట్ ఎడిషన్ లెజిస్లేటర్స్ స్పోర్ట్స్ మీట్ 2026 కోసం చేస్తున్న ఏర్పాట్లను ఆయన స్పోర్ట్స్ అథారిటీ ఎండీ డాక్టర్ సోనీ బాలాదేవి, అధికారులు, సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అన్ని వర్గాల్లో క్రీడల పట్ల అవగాహన తీసుకురావడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న శాసనసభ్యుల క్రీడోత్సవ పోటీలను ఘనంగా నిర్వహించబోతున్నామనీ, తద్వారా రాష్ట్రంలో క్రీడల పట్ల అవగాహన, ఆసక్తి పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని వినియోగించబోతున్నట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా నిర్వహించబోతున్న ఈ క్రీడా పోటీల్లో పార్టీల భేద భావాలు లేకుండా, అన్ని పక్షాల శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు భాగస్వామ్యం అవుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రారంభోత్సవ వేడుకల్లో టగ్ ఆఫ్ వార్, ఫుట్ బాల్, క్రికెట్ అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్ బాడ్మింటన్, టేబుల్ టెన్నిస్‌తో పాటు కొన్ని రిక్రియేషనల్ క్రీడా పోటీలు నిర్వహించబోతున్నట్టు ఆయన తెలిపారు. ఈ పోటీలు వీక్షించడానికి అందరికీ ఉచిత ప్రవేశం కల్పించబోతున్నామనీ, అందరికీ అవసరమైన సౌకర్యాలను సమకూర్చామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణలో వర్షాలు... ఎల్లో అలర్ట్ జారీ

- ఉరుములు, మెరుపులతో వర్ష సూచన
- గంటకు 30--50 కి.మీ వేగంతో ఈదురుగాలులు

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 29 వరకు పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో ఎల్లో అలర్ట్ జారీ చేస్తూ ప్రజలు, ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. రానున్న నాలుగు రోజుల్లో గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో వర్షాలు పడే అవకాశముందని తెలిపింది.

అలాగే హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో కూడా వర్ష ప్రభావం కనిపించనుందని పేర్కొంది. ఇక హైదరాబాద్ నగరంలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉండగా, సాయంత్రం లేదా రాత్రి సమయంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.



## ఎన్నికల తర్వాత గ్యాస్ రూ.2000

- టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీ

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

అసెంబ్లీ ఎన్నికల అనంతరం దేశంలో గ్యాస్, పెట్రోల్ ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ అభిషేక్ బెనర్జీ ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లోని బిన్పూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఏప్రిల్ 29 తర్వాత బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎల్పిజి, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచవచ్చని పేర్కొన్నారు. ఏప్రిల్ 30 నాటికి గ్యాస్ సిలిండర్ ధర రూ.2,000కు చేరే అవకాశం ఉందని, పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు రూ.200 వరకు పెరిగే ప్రమాదం ఉందని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెట్రోల్‌పై లీటరుకు రూ.3, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని పూర్తిగా తగ్గించినట్లు ప్రకటించిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ధైర్యముంటే వచ్చే ఐదేళ్లలో ఇంధన ధరలు పెంచబోమని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు ఎన్నికల ప్రచారంలో హామీ ఇవ్వాలని సవాల్ విసిరారు. 2014 నుంచి మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎల్పిజి ధరలు భారీగా పెరిగాయని అభిషేక్ బెనర్జీ విమర్శించారు. సిలిండర్ ధర రూ.400 నుంచి వెయ్యి రూపాయిలకు పైగా పెరిగిందని, సాధారణ ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

# గాయకుడిగా బండి సంజయ్ కొత్త అవతారం...

- ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకల సందర్భంగా గీతాల విడుదల
- కరీంనగర్‌లో శ్రీరామ నవమి సందర్భంగా రెండు దేశభక్తి గీతాల ఆవిష్కరణ

**బలగం టీవీ, హైదరాబాద్**



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గాయకుడిగా కొత్త అవతారం ఎత్తారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) స్థాపనకు 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సంఘ్ గీతాల వీడియోలను విడుదల చేశారు. ఈ వీడియోల్లో బండి సంజయ్ స్వయంగా పాడిన రెండు పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఈ గీతాలకు ప్రముఖ సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ స్వరాలు సమకూర్చారు. "గళమెత్తి పాడాలి", "మాతృ మూర్తి పదాల ముందర" అనే రెండు పాటల వీడియోలను కరీంనగర్ లో విడుదల చేశారు.

ఆర్ఎస్ఎస్ శతవసంతాలు పూర్తయిన నేపథ్యంలో సంఘ్ సిద్ధాంతాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలనే లక్ష్యంతో ఈ గీతాలను ఆలపించినట్లు తెలిపారు. చిన్ననాటి నుండి ఆర్ఎస్ఎస్‌లో సేవలు అందిస్తున్న బండి సంజయ్, జాతీయవాదం మరియు హిందుత్వ భావజాలాన్ని ఆచరిస్తూ సంఘ్ సమావేశాల్లో దేశభక్తి గీతాలు పాడేవారు. ఇటీవల ఈ వీడియోలకు సంబంధించిన ప్రోమో విడుదల కావడంతో సోషల్ మీడియాలో మంచి స్పందన లభించింది. కాగా, శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయంలో వేలాది మంది భక్తులు, చిన్నారుల సమక్షంలో గీతాల వీడియోలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రచయిత ఆకుల నాగేశ్వర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

# మంచు చరియలు విరిగి పడి 7 మంది మృతి

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

శ్రీనగర్--లేహ్ జాతీయ రహదారి పై శుక్రవారం చోటుచేసుకున్న విషాద ఘటనలో మంచు చరియలు విరిగి పడటంతో ఏడుగురు మృతి చెందగా, మరో ఐదుగురు గాయపడ్డారని అధికారులు వెల్లడించారు. జోజిలా పాస్ పరిధిలోని జీరో పాయింట్ నుంచి మినిమార్గ్ మధ్య మధ్యాహ్న సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. ఇటీవల కురిసిన భారీ మంచు కారణంగా కొండ చరియలు ఒక్కసారిగా విరిగి పడటంతో పలు వాహనాలు మంచులో చిక్కుకుపోయాయి. సమాచారం అందుకున్న వెంటనే బార్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్‌వో), పోలీసు బృందాలు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. మంచును తొలగించడంతో పాటు ట్రాఫిక్‌ను పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నాయి. ఈ ఘటనపై లద్దాఖ్ గవర్నర్ వీకే సక్సేనా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సంఘటన స్థలాన్ని సందర్శించి సహాయక చర్యలను సమీక్షించారు. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఈ ప్రమాదంపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. గాయపడిన వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నట్లు 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

# నేపాల్ 47వ ప్రధానిగా బలేన్ ప్రమాణ స్వీకారం



- యువ నేతకు భారీ మద్దతు...
- జెన్-జెడ్ ఉద్యమం తరువాత రాజకీయ మార్పులకు నాంది

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ర్యాపర్‌గా గుర్తింపు పొందిన తర్వాత రాజకీయాల్లోకి అడుగుపెట్టిన బలేంద్ర షా 'బలేన్'గా ప్రసిద్ధి చెందిన నేత, నేపాల్ 47వ ప్రజాస్వామ్య ప్రధానిగా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. దేశాన్ని కుదిపేసిన జెన్–జెడ్ ఉద్యమం అనంతరం కేపీ శర్మ ఓలి ప్రభుత్వం కూలిన దాదాపు ఆరు నెలల తరువాత ఆయన అధికారంలోకి వచ్చారు.

35 ఏళ్ల వయస్సు గల రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (ఆర్ఎస్‌పీ) నేత బలేన్‌కు అధ్యక్షుడు రామ్ చంద్ర పౌడెల్, శీతల్ నివాస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేయించారు. కాఠ్మండు మాజీ మేయర్ అయిన బలేన్, నేపాల్ చరిత్రలో అత్యంత పిన్న వయస్సులో ప్రజాస్వామ్యంగా ఎన్నికైన ప్రధానిగా నిలిచారు. అలాగే మధేశ్ ప్రాంతం నుంచి ఈ పదవిని చేపట్టిన తొలి వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. ప్రమాణ స్వీకార వేడుకలో హిందూ, బౌద్ధ సంప్రదాయాల సమ్మేళనం కనిపించింది. శంఖనాదాలు, స్వస్తి వచనాలు, బౌద్ధ మంగళ వచనాలతో కార్యక్రమం వైభవంగా జరిగింది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 76(1) ప్రకారం అధ్యక్షుడు బలేన్‌ను అధికారికంగా ప్రధానిగా నియమించారు. ఈ సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలియజేస్తూ, భారత్–నేపాల్ సంబంధాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. రెండు దేశాల మధ్య చారిత్రాత్మక 'రోటి–బేటీ' బంధాన్ని గుర్తు చేశారు. గత సంవత్సరం సెప్టెంబర్‌లో అవినీతి, బంధుప్రీతి, సోషల్ మీడియా నిషేధానికి వ్యతిరేకంగా యువత చేపట్టిన జెన్–జెడ్ ఉద్యమం హింసాత్మకంగా మారడంతో ఓలి ప్రభుత్వం కూలిపోయింది. అనంతరం తాత్కాలిక ప్రధానిగా సుశీలా కార్కీ బాధ్యతలు నిర్వర్తించారు.

మార్చి 5న జరిగిన ఎన్నికల్లో బలేన్, ఝాపా–5 నియోజకవర్గంలో ఓలిని భారీ మెజారిటీతో ఓడించారు. మొత్తం 275 స్థానాల్లో 182 సీట్లు గెలుచుకున్న ఆర్ఎస్‌పీ స్పష్టమైన మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. బలేన్‌తో పాటు పలువురు మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. స్వర్ణిమ్ వాగ్లే ఆర్థిక మంత్రిగా, శిశిర్ ఖనాల్ విదేశాంగ మంత్రిగా, సుదన్ గురుంగ్ హోం మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. రక్షణ, పరిశ్రమ–వాణిజ్య శాఖలను బలేన్ తన వద్దే ఉంచుకున్నారు.



# నగరంలో డ్రగ్స్ కొనుగోలు..

- ఇద్దరు నిందితుల అరెస్టు
- రూ. 6లక్షల విలువైన 60 గ్రాముల ఏండీఏంఏ స్వాధీనం

**బలగం టీవీ, హైదరాబాద్**

నగరంలో డ్రగ్స్ సరఫరాదాల నుంచి మాదకద్రవ్యాలను కొనుగోలు చేసిన ఇద్దరు నిందితులను టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. సనత్ నగర్ పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించిన టాస్క్‌ఫోర్సు పోలీసులు నిందితుల నుంచి 60 గ్రాముల ఏండీఏంఏను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.6లక్షలుంటుందని పోలీసులు తెలిపారు. శుక్రవారం డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపిన వివరాల మేరకు ఐడీపీఎల్‌కు చెందిన సోంగపు హేమంత్, ముక్కగళ్ల నాగేంద్రలు డ్రగ్స్‌ను వినియోగిస్తున్నారు. డ్రగ్స్ కావాలని చింతల్‌కు చెందిన సాయి నిఖిల్, ఆదిత్యను సంప్రదించారు. తక్కువ ధరకు డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న సాయి నిఖిల్ యాదవ్, ఆదిత్య అవసరమైన వారికి డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో వారి వద్ద నుంచి సోంగపు హేమంత్, ముక్కగళ్ల నాగేంద్రలు డ్రగ్స్‌ను కొనుగోలు చేసినట్టు టాస్క్‌ఫోర్సు పోలీసులకు సమాచారం రావడంతో వారిని అరెస్టు చేశారు. పరారీలో వున్న సాయి నిఖిల్ యాదవ్, ఆదిత్య కోసం గాలిస్తున్నామని డీసీపీ తెలిపారు. ఈ ఆపరేషన్‌లో జూబ్లీహిల్స్ జోన్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ యదేందర్, ఎస్.ఐ.పి. డి. రవిరాజ్‌తోపాటు వారి బందం, సనత్ నగర్ పోలీసులున్నారు.

# కుళ్లిన చికెన్ సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

- సుమారు 352 కిలోల చికెన్ స్వాధీనం

**బలగం టీవీ, హైదరాబాద్**



ప్రజారోగ్యానికి హాని కలిగించే విధంగా నిల్వ ఉంచిన కుళ్లిన చికెన్‌ను సరఫరా చేస్తున్న వ్యక్తిని హైదరాబాద్ కమిషనర్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 352కిలోల చికెన్‌ను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం డీసీపీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ తెలిపిన వివరాల మేరకు కూకట్‌పల్లికి చెందిన సూరజ్ పాల్ అనే వ్యాపారీ రాజీవ్ గాంధీ నగర్‌లో నివాసముంటున్నాడు. సులువుగా డబ్బులు సంపాదించాలని కుళ్లిన చికెన్‌ను సరఫరా చేయడం ప్రారంభించాడు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరం అందుకున్న టాస్క్‌ఫోర్సులు వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ కె. నాగార్జునతో కలిసి మూసాపేట సమీపంలోని భరత్ నగర్, జింకలవాడ వద్ద ఉన్న 'మెసర్స్ ఎస్.పి.ఆర్ చికెన్' ప్రాంగణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో నిల్వ ఉంచిన కుళ్ళిన చికెన్‌ను గుర్తించారు. దీనిని స్థానిక హోటళ్లు, ఇతర వాటికి సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు తదుపరి విచారణ కోసం సనత్‌నగర్ పోలీసులకు అప్పగించారు.



## ఆరంభ పోరుకు చిన్నస్వామి స్టేడియం సిద్ధం

- **పది నెలల విరామం తర్వాత మ్యాచ్‌లకు సిద్ధమైన చిన్నస్వామి స్టేడియంలిలి**

**బలగం టీవి, హైదరాబాద్**

దాదాపు పది నెలలకు పైగా క్రికెట్ మ్యాచ్‌లకు దూరంగా ఉన్న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో మళ్లీ ఐపీఎల్ సందడి నెలకొంది. టోర్నీ ఆరంభానికి ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) ఆటగాళ్లు మైదానంలోకి దిగుతూ నెట్స్‌లో తీవ్రంగా సాధన చేశారు.

గత ఏడాది జూన్ 4న చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటన తర్వాత మ్యాచ్‌ల నిర్వహణకు నోచుకోని ఈ స్టేడియానికి ఇప్పుడు పూర్వ వైభవం వచ్చింది. కర్నాటక క్రికెట్ సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్ ప్రసాద్ ప్రత్యేక దృష్టి సారించడంతో మ్యాచ్‌ల నిర్వహణకు ఉన్న అడ్డంకులు తొలగించబడ్డాయి. ప్రభుత్వం నుంచి అనుమతులు పొందడంతో పాటు ఏకసభ్య కమిషన్ సూచనల మేరకు స్టేడియంలో అవసరమైన నిర్మాణాత్మక మార్పులు చేపట్టారు. శనివారం రాత్రి 7:30 గంటలకు జరిగే ఆరంభ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీని రికార్డు బ్రేకర్ ఎస్‌ఆర్‌హెచ్ ఢీకొననుంది. మ్యాచ్ సన్నద్ధతలో భాగంగా శుక్రవారం ఇరుజట్ల ఆటగాళ్లు నెట్స్‌లో చెమటోడ్చారు. బ్యాటర్లు భారీ షాట్ల ప్రాక్టీస్ చేస్తుండగా, బౌలర్లు వికెట్లే లక్ష్యంగా బంతులు సంధించారు. ఫీల్డింగ్ డ్రిల్స్‌తో స్టేడియంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. ఆర్సీబీ తరఫున విరాట్ కోహ్లీ, రజత్ పాటిదార్, జాకబ్ బెథెల్‌లు బ్యాటింగ్ సాధనలో బిజీగా గడిపారు. ఎస్‌ఆర్‌హెచ్ వైపు నుంచి ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, హెన్రిచ్ క్లాసెన్, అనికేత్ వర్మలు భారీ షాట్లతో సిద్ధమని సంకేతాలు ఇచ్చారు. టోర్నీని విజయంతో ప్రారంభించాలనే పట్టుదలతో ఉన్న ఇరుజట్లలో తొలి బోణీ కొట్టేది ఎవరో అన్న ఉత్కంఠ అభిమానుల్లో నెలకొంది.




## రిటైర్‌మెంట్ నిర్ణయంపై ఎవిన్ లూయిస్ యూటర్న్.

**బలగం టీవి, హైదరాబాద్**

వెస్టిండీస్ సీనియర్ క్రికెటర్ ఎవిన్ లూయిస్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఇటీవల జరిగిన టీ20 ప్రపంచకప్-2026కు ప్రకటించిన జట్టులో తనకు చోటు దక్కకపోవడంతో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన లూయిస్.. తాజాగా ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నాడు. రిటైర్‌మెంట్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటిస్తూ మళ్లీ మైదానంలోకి దిగేందుకు సిద్ధమయ్యాడు.

ఈ నేపథ్యంలో ట్రినిడాడ్ అండ్ టొబాగో జట్టు తరఫున నాలుగు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్‌లో పాల్గొననున్నట్లు తెలిపాడు. ఇప్పటివరకు తన కెరీర్‌ను ప్రధానంగా వైట్‌బాల్ క్రికెట్‌కే పరిమితం చేసిన లూయిస్.. తొమ్మిదేళ్ల తర్వాత టెస్ట్ క్రికెట్‌లోనూ ఆడాలనే ఆశయం వ్యక్తం చేశాడు. ఫస్ట్‌క్లాస్ కెరీర్‌లో ట్రినిడాడ్ అండ్ టొబాగో తరఫున 22 మ్యాచ్‌లు ఆడిన లూయిస్ 1229 పరుగులు సాధించాడు. 2016లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన అతడు 67 వన్డేల్లో 2175 పరుగులు, 65 టీ20 మ్యాచ్‌ల్లో 1782 పరుగులు చేశాడు. ఇందులో వన్డేల్లో ఐదు సెంచరీలు, టీ20ల్లో రెండు సెంచరీలు నమోదు చేశాడు. 2016 టీ20 ప్రపంచకప్ గెలిచిన వెస్టిండీస్ జట్టులో సభ్యుడిగా ఉన్న లూయిస్ పలు రికార్డులు కూడా నెలకొల్పాడు. ముఖ్యంగా అంతర్జాతీయ క్రికెట్‌లో 176 పరుగుల వద్ద రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన ఆటగాడిగా గుర్తింపు పొందాడు. టీ20 ఫార్మాట్‌లో వెస్టిండీస్ తరఫున 125 నాటౌట్ అత్యధిక స్కోర్ నమోదు చేసి చరిత్ర సృష్టించాడు.



## పీఎస్‌ఎల్‌లో ఆట మధ్యలో మారిన బంతి రంగు

- **నాసిరకం జెర్సీల వల్లేనన్న అనుమానాలు**

**బలగం టీవి, హైదరాబాద్**

పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్‌ఎల్)లో ఓ విచిత్ర ఘటన చోటుచేసుకుంది. లాహోర్‌లోని గడాఫీ స్టేడియం వేదికగా లాహోర్ ఖలందర్స్, హైదరాబాద్ కింగ్స్‌మెన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆట మధ్యలో బంతి రంగు మారడం చర్చనీయాంశమైంది. హైదరాబాద్ జట్టు బౌలింగ్ చేస్తున్న సమయంలో బంతి ముందుగా పింక్ రంగులో ఉండగా, అనంతరం ఎరుపు రంగులోకి మారినట్లు గమనించారు. సాధారణంగా బంతికి మెరుపు తెప్పించేందుకు ఆటగాళ్లు జెర్సీలకు రుద్దుతుంటారు. ఈ క్రమంలో జెర్సీ రంగు బంతికి అంటి ఉండవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. జెర్సీలు నాసిరకంగా ఉండటం వల్లే ఈ పరిస్థితి తలెత్తి ఉంటుందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై హైదరాబాద్ కింగ్స్‌మెన్ కెప్టెన్ మార్నస్ లబుషేన్ అంపైర్‌కు ఫిర్యాదు చేశాడు. మ్యాచ్ అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 'రెండో ఓవర్ తర్వాతనే అంపైర్‌తో ఈ విషయంపై మాట్లాడాను. బంతి ఉన్నట్టుండి ఎరుపెక్కింది. అసలు ఏమి జరిగిందో అర్థం కాలేదు. ఇది జెర్సీల వల్లే జరిగి ఉండొచ్చు. ఇలాంటి ఘటనను నేను ఎప్పుడూ చూడలేదు' అని పేర్కొన్నాడు. రానున్న మ్యాచ్‌లకు ముందు సమస్యను పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశాడు.

ఇదిలా ఉండగా ఈ మ్యాచ్‌లో లాహోర్ ఖలందర్స్ జట్టు హైదరాబాద్‌పై విజయం సాధించింది. మ్యాచ్ అనంతరం సోషల్ మీడియాలో హైదరాబాద్ కింగ్స్‌మెన్ జట్టు 'తమ తొలి పింక్ బాల్ మ్యాచ్ గెలిచినందుకు లాహోర్ జట్టుకు అభినందనలు' అంటూ పోస్ట్ చేసింది. మరోవైపు ఈ ఘటనపై క్రికెట్ అభిమానులు సోషల్ మీడియా వేదికగా పీఎస్‌ఎల్ నిర్వాహకులను తీవ్రంగా విమర్శిస్తున్నారు.

## భారత జట్టుకు వైభవ్ సూర్యవంశీకి అర్హత

**బలగం టీవి, హైదరాబాద్**



భారత క్రికెట్‌లో సంచలనంగా మారుతున్న బీహార్ యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ తన కెరీర్‌లో కీలక మైలురాయిని చేరుకున్నాడు. శుక్రవారం (మార్చి 27) 15వ ఏట అడుగుపెట్టిన అతను, అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నిబంధనల ప్రకారం భారత సీనియర్ జట్టుకు ఆడేందుకు అధికారికంగా అర్హత సాధించాడు. ఈ పరిణామంతో భారత క్రికెట్ భవిష్యత్తుపై కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభ కనబరిచిన వైభవ్, ఇటీవల జరిగిన అండర్-19 ప్రపంచకప్‌లో కేవలం 14 ఏళ్లకే భారత్‌కు ప్రాతినిధ్యం వహించి అందరి దృష్టిని ఆకర్షించాడు. అంతేకాకుండా ఐపీఎల్ చరిత్రలో అత్యంత వేగంగా --- కేవలం 35 బంతుల్లో --- సెంచరీ సాధించిన భారత ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. అండర్-19 స్థాయిలో కూడా అతని పేరిట అనేక రికార్డులు నమోదవడం అతని ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తోంది. యువ ఆటగాళ్ల శారీరక, మానసిక సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఐసీసీ 2020లో కీలక నిబంధనను అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం అంతర్జాతీయ మ్యాచ్‌లు (అండర్-19 ఈవెంట్లు సహా) ఆడాలంటే ఆటగాడికి కనీసం 15 ఏళ్లు నిండి ఉండాలి. ఇప్పుడు ఈ వయోపరిమితిని సహజంగానే అధిగమించిన వైభవ్‌కు సీనియర్ జట్టు ఎంపికలో ఎలాంటి అడ్డంకులు లేకపోవడం విశేషం.

రానున్న ఐపీఎల్ 2026 సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ రాజస్థాన్ రాయల్స్ తరఫున బరిలోకి దిగనున్నాడు. యువ ఆటగాడిపై ఒత్తిడి పడకుండా జట్టు యాజమాన్యం జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ సందర్భంగా జట్టు కెప్టెన్ రియాన్ పరాగ్ మాట్లాడుతూ, "అతను మీడియా దృష్టికి దూరంగా ఉండటం మంచిది. ప్రెస్ కాన్ఫరెన్స్‌లకు ఎక్కువగా హాజరు కాకూడదు" అని సూచించాడు.

# నేటి నుంచి ఐపీఎల్ ధనాధన్

- **ఆర్సీబీ--ఎస్‌ఆర్‌హెచ్ తొలి మ్యాచ్**

**బలగం టీవి, హైదరాబాద్**

క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. ఈ మెగా టోర్నమెంట్ మార్చి 28న అట్టహాసంగా ప్రారంభం కానుంది. భారత్‌లో మ్యాచ్‌లను స్టార్ స్పోర్ట్స్ ఛానెళ్లలో ప్రత్యక్ష ప్రసారం చేయనుండగా, డిజిటల్ హక్కులు దక్కించుకున్న జియోహాట్‌స్టార్ తమ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లో లైవ్ స్ట్రీమింగ్ అందించనుంది. ఈసారి ఇంగ్లీష్, హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో కామెంట్రీ అందుబాటులో ఉండనుంది. అదనంగా బెంగాలీ, భోజ్‌పురి, హర్యానీ భాషల్లోనూ ఫీడ్స్ ఇవ్వనున్నారు. మొబైల్ వినియోగదారుల కోసం వర్టికల్ లైవ్ ఫీడ్, 360 డిగ్రీ వ్యూ, మల్టీ క్యామ్ ఫీచర్లను కూడా అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు, 2016 విజేత సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతో తలపడనుంది. రెండు నెలలకు పైగా క్రికెట్ అభిమానులను అలరించనున్న ఈ టోర్నీ మే 31న జరిగే ఫైనల్‌తో ముగుస్తుంది.

ఈ సీజన్‌లో మొత్తం 12 డబుల్ హెడర్ రోజులు ఉండనున్నాయి. డబుల్ హెడర్ ఉన్న రోజుల్లో తొలి మ్యాచ్ మధ్యాహ్నం 3:30 గంటలకు, రెండో మ్యాచ్ రాత్రి 7:30 గంటలకు ప్రారంభమవుతుంది. టోర్నీలో పాల్గొనే పది జట్లు గ్రూప్ స్టేజ్‌లో ఒక్కోటి 14 మ్యాచ్‌లు ఆడనున్నాయి. పాయింట్ల పట్టికలో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. క్వాలిఫయర్-1, ఎలిమినేటర్, క్వాలిఫయర్-2, ఫైనల్ ఫార్మాట్‌లో ప్లేఆఫ్స్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, లక్నో సూపర్ జెయింట్స్, ముంబై ఇండియన్స్, పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు బరిలోకి దిగుతున్నాయి. దేశవ్యాప్తంగా 12




ప్రధాన నగరాల్లో మ్యాచ్‌లను నిర్వహించనున్నారు.

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభ మ్యాచ్‌కు బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) జట్లు తలపడనున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్‌గా తొలిసారి బరిలోకి దిగుతున్న ఆర్సీబీపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

మాజీ భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ రీఎంట్రీపై అందరి దృష్టి నిలిచింది. మరోవైపు ఎస్‌ఆర్‌హెచ్‌కు చెందిన ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మల పవర్ హిట్టింగ్ కూడా మ్యాచ్‌లో కీలకంగా మారనుంది. గత రెండు సీజన్లుగా ఈ జోడీ పవర్‌ప్లేలోనే బౌలర్లపై దాడి చేస్తూ ప్రత్యర్థి జట్లకు సవాల్‌గా మారింది.

2024 సీజన్‌లో ఎస్‌ఆర్‌హెచ్ రన్నరప్‌గా నిలిచినప్పుడు హెడ్--అభిషేక్ జోడీ అనేక రికార్డులు సృష్టించింది. పవర్‌ప్లేలో నాలుగు సార్లు 50కి పైగా భాగస్వామ్యాలు నమోదు చేయడమే కాకుండా, లక్నో సూపర్ జెయింట్స్‌పై కేవలం 30 బంతుల్లోనే జట్టు శతకం పూర్తి చేసి సంచలనం సృష్టించింది.

గత సీజన్‌లో ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో కూడా హైదరాబాద్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 231 పరుగులు సాధించింది. హెడ్--అభిషేక్ దూకుడు, ఇషాన్ కిషన్ 48 బంతుల్లో 94 పరుగులతో ఆ జట్టు భారీ స్కోర్ నమోదు చేసింది. ఈసారి కూడా చిన్నస్వామి పిచ్ బ్యాటర్లకు అనుకూలంగా ఉండే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఉప్పల్‌లో వెస్టిండీస్‌తో టీ20... జింబాబ్వేతో వన్డే మ్యాచ్‌లు



**బలగం టీవి, హైదరాబాద్**

టీమిండియా 2026--27 హోం సీజన్ షెడ్యూల్‌ను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) గురువారం విడుదల చేసింది. ఈ క్యాలెండర్‌లో భాగంగా హైదరాబాద్ నగరానికి రెండు అంతర్జాతీయ మ్యాచ్‌లకు ఆతిథ్యం దక్కింది. వెస్టిండీస్‌తో జరిగే టీ20 మ్యాచ్‌తో పాటు జింబాబ్వేతో ఒక వన్డే మ్యాచ్ ఇక్కడ నిర్వహించనున్నారు.

వెస్టిండీస్, శ్రీలంక, జింబాబ్వే, ఆస్ట్రేలియా జట్లు భారత పర్యటనకు రానున్నాయి. ఈ హోం సీజన్‌లో భారత్ మొత్తం ఐదు టెస్టులు, తొమ్మిది వన్డేలు, ఎనిమిది టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. మొత్తం 22 మ్యాచ్‌లను దేశవ్యాప్తంగా 17 నగరాల్లో నిర్వహించేందుకు బోర్డు నిర్ణయించింది. వెస్టిండీస్‌తో సిరీస్ సెప్టెంబర్ 27, 2026న ప్రారంభమై 2027 మార్చి 3న ముగియనుంది. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ దృష్ట్యా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి సీనియర్ ఆటగాళ్లు తొమ్మిది వన్డేల్లో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. ఇదిలా ఉండగా, 2002 తర్వాత జింబాబ్వే జట్టు భారత్‌లో తొలిసారి పర్యటించనుంది.

బోర్డర్--గవాస్కర్ ట్రోఫీ భాగంగా వచ్చే జనవరి నుంచి ఆస్ట్రేలియాతో భారత్ ఐదు టెస్టుల సిరీస్ ఆడనుంది. నాగ్‌పూర్, చెన్నై, గువాహటి, రాంచీ, అహ్మదాబాద్ నగరాలు ఈ టెస్టులకు వేదికలుగా ఖరారయ్యాయి. హైదరాబాద్‌లో వెస్టిండీస్‌తో నాలుగో టీ20 అక్టోబర్ 14న జరగగా, జింబాబ్వేతో రెండో వన్డే 2027 జనవరి 6న నిర్వహించనున్నారు.

**ఉప్పల్‌లో ఆడే మ్యాచ్‌లు**

1. వెస్టిండీస్ పర్యటన (సెప్టెంబర్ – అక్టోబర్ 2026)
అక్టోబర్ 14: నాలుగో టీ20 – హైదరాబాద్
2. జింబాబ్వే పర్యటన (జనవరి 2027)


## మరో 10 ఏళ్లు ఐపీఎల్‌లో ధోనీ కొనసాగాలి


- **యోగ్‌రాజ్ సింగ్**
- **రిటైర్మెంట్‌పై విమర్శకులకు కౌంటర్‌లిలి**

**బలగం టీవి, హైదరాబాద్**

టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ ఐపీఎల్‌లో మరో పదేళ్ల పాటు కొనసాగాలని మాజీ క్రికెటర్ యోగ్‌రాజ్ సింగ్ అభిప్రాయపడ్డాడు. ధోనీ ఇప్పటికీ ఫిట్‌గా ఉన్నాడని, రిటైర్ కావాలని అతనికి ఎవరూ చెప్పాల్సిన అవసరం లేదని పేర్కొన్నాడు. ఆరు సంవత్సరాల క్రితమే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ధోనీ ప్రస్తుతం ఐపీఎల్‌లో మాత్రమే కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ప్రతి ఐపీఎల్ సీజన్‌కు ముందు ధోనీ రిటైర్మెంట్‌పై ఊహాగానాలు వినిపిస్తుంటాయి. 44 ఏళ్ల వయసులో ఉన్న ధోనీకి ఇదే చివరి సీజన్ కావచ్చని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈసారి అతను ఇంపాక్ట్ ప్లేయర్‌గా కొనసాగాలా, లేక రెగ్యులర్ ఆటగాడిగా ఆడాలా అన్న చర్చ కూడా సాగుతోంది. యువ ఆటగాళ్లకు అవకాశాలు ఇవ్వాలనే సూచనలు కూడా వినిపిస్తున్నాయి.

తాజాగా ఓ స్పోర్ట్స్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో యోగ్‌రాజ్ సింగ్ మాట్లాడుతూ, 'ధోనీ ఇంకా ఆడుతున్నాడు. మరో 10 ఏళ్ల వరకు అతను కొనసాగాలి. సరైన క్రమశిక్షణ, అంకితభావంతో తన





ఫిట్‌నెస్‌ను నిరూపించుకున్నాడు. అతను అద్భుతమైన వ్యక్తి. అతను రిటైర్ కావాలని చెప్పడానికి ఇతరులు ఎవరు?' అని ప్రశంసించాడు. ఇదిలా ఉండగా, టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కూడా ధోనీ ఈ సీజన్‌లో రెగ్యులర్ ప్లేయర్‌గా ఆడతాడని అభిప్రాయపడ్డాడు. 'అతనికి ఆడటం ఇష్టం లేకపోతే ఎప్పుడో రిటైర్ అయ్యేవాడు. గత మూడు నెలలుగా ప్రాక్టీస్ చేస్తున్నాడంటే తనకు ఇంకా ఆడాలనే ఉద్దేశమేనని స్పష్టం అవుతోంది' అని పేర్కొన్నాడు.



## స్టేడియంలోకి భారత ఫుట్‌బాల్ జట్టుకు నో ఎంట్రీ...

- **ఆసియా కప్ క్వాలిఫయర్ సన్నాహాల్లో ఆటంకం**
- **మీడియా సమావేశం కూడా రద్దు**

**బలగం టీవి, కొచ్చి**

ఆసియా కప్ క్వాలిఫయర్‌కు సన్నద్ధమవుతున్న భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టుకు ఘోర అవమానం ఎదురైంది. ప్రాక్టీస్ మ్యాచ్ కోసం కొచ్చిలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియానికి వెళ్లిన హెడ్‌కోచ్ ఖలీద్ జమిల్, ఆటగాళ్లను స్టేడియం లోపలికి అనుమతించకపోవడంతో వివాదం తలెత్తింది. ఈ ఘటన కారణంగా మ్యాచ్‌కు ముందు జరగాల్సిన మీడియా సమావేశం కూడా రద్దైంది.

హాంకాంగ్‌తో జరగనున్న మ్యాచ్‌కు ముందు కొచ్చిలోని జవహర్‌లాల్ నెహ్రూ అంతర్జాతీయ స్టేడియానికి చేరుకున్న హెడ్‌కోచ్ ఖలీద్ జమిల్‌తో పాటు ముగ్గురు ఆటగాళ్లను భద్రతా సిబ్బంది లోపలికి అనుమతించలేదు. స్టేడియం వద్ద భద్రతా సిబ్బంది వారిని గేటు వద్దే అడ్డుకున్నట్లు సమాచారం. గ్రేటర్ కొచ్చిన్ డెవలప్‌మెంట్ అథారిటీ (జీసీడీఏ)కు చెల్లించాల్సిన బాకీలు ఆలస్యమైనందునే ఈ పరిస్థితి తలెత్తినట్లు తెలుస్తోంది. కోచ్ జమిల్‌తో పాటు అషిక్ కురునియన్, సహల్ అబ్దుల్ సమద్, బిజోయ్ వర్గీస్ స్టేడియానికి చేరుకున్నప్పటికీ అనుమతి లభించలేదు.

ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో భాగంగా హాంకాంగ్‌తో జరగనున్న మ్యాచ్‌కు ముందు ఇలాంటి వివాదం తలెత్తడం భారత ఫుట్‌బాల్ పరిపాలనా వ్యవస్థపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. దాదాపు దశాబ్దం తర్వాత కొచ్చిలో భారత జట్టు మ్యాచ్ ఆడనున్న నేపథ్యంలో ఈ ఘటన క్రీడా వర్గాల్లో చర్చనీయాంశమైంది.

## ఆర్సీబీతో తొలి పోరుకు సిద్ధమైన సన్‌రైజర్స్...

- **విజయమే లక్ష్యంగా ఆరెంజ్ ఆర్మీలిలి**
- **బ్యాటింగ్ బలంగా.. బౌలింగ్‌పై ఆందోళనలిలి**

**బలగం టీవి, హైదరాబాద్**

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తొలి మ్యాచ్‌కు సిద్ధమైంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా శనివారం జరిగే ఆరంభ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో ఆరెంజ్ ఆర్మీ తలపడనుంది. ఇప్పటికే సన్నాహకాలను పూర్తి చేసుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది.

గత సీజన్‌లో పేలవ ప్రదర్శనతో ఆరో స్థానంతో సరిపెట్టుకున్న హైదరాబాద్ జట్టు ఈసారి మెరుగైన ఫలితాల కోసం పట్టుదలతో ఉంది. బ్యాటింగ్ విభాగం బలంగా కనిపిస్తున్నప్పటికీ బౌలింగ్‌లో కొంత బలహీనత కనిపిస్తోంది. ప్యాట్ కమిన్స్, ఇషాన్ మలింగా గాయాలతో ఇబ్బంది పడుతుండటం జట్టుకు ఆందోళన కలిగిస్తోంది. కమిన్స్ గైర్హాజరీలో ఇషాన్ కిషన్ జట్టును నడిపించే అవకాశం ఉంది.

ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ ఓపెనర్లుగా బరిలోకి దిగనుండగా, ఫస్ట్ డౌన్‌లో ఇషాన్ కిషన్ ఆడనున్నాడు. నాలుగో స్థానంలో హెన్రీచ్ క్లాసెన్, ఐదో స్థానంలో యువ ఫినిషర్ సలీల్ అరోరాకు అవకాశం దక్కే సూచనలు ఉన్నాయి. దేశవాళీ క్రికెట్‌తో పాటు ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్‌ల్లో అద్భుత ప్రదర్శనతో అతను తుది



జట్టులో స్థానం దక్కించుకునే అవకాశాలు పెరిగాయి. లియామ్ లివింగ్‌స్టోన్ ఆరో స్థానంలో బ్యాటింగ్ చేయనుండగా, నితీష్ కుమార్ రెడ్డి, హర్షల్ పటేల్ తదుపరి స్థానాల్లో ఆడే అవకాశముంది. స్పిన్ విభాగంలో హర్ష్ దూబే కీలక పాత్ర పోషించనున్నాడు. పేస్ విభాగాన్ని జయదేవ్ ఉనాద్కత్ నడిపించనున్నాడు. కమిన్స్ స్థానాన్ని భర్తీ చేసే బాధ్యత బ్రైడన్ కార్స్‌కు దక్కనుండగా, ఇషాన్ మలింగా మ్యాచ్ ఫిట్‌నెస్ సాధిస్తే కాంబినేషన్‌లో మార్పులు చోటుచేసుకునే అవకాశముంది.

పరుగుల వరద పారే చిన్నస్వామి పిచ్‌పై హైదరాబాద్ బ్యాటర్లు చెలరేగితే భారీ స్కోర్ నమోదు చేసే అవకాశం ఉంది. అయితే బౌలింగ్ లోపాలను అధిగమించగలిగితేనే సన్‌రైజర్స్‌కు విజయావకాశాలు మెరుగవుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

balagamtv100@gmail.com

# పెద్ది టీజర్ విడుదల



రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'పెద్ది'. రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్‌ను విడుదల చేశారు. 'పెద్ది అంటే బంతితో బ్యాటుకు ఎదురెళ్లే ఆట కాదురా.. పాణంతో సావుకు ఎదురెళ్లే ఆట' అనే డైలాగు.. 'ఆటే నా పొగరు' అని హీరో చెప్పడం ఆకట్టుకుంటోంది . చరణ్‌కు జోడీగా జాన్వీ కపూర్ నటిస్తోన్న ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు 'పెద్ది' టీమ్ స్పెషల్ ట్రీట్ అందించింది. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ భారీ రూరల్ స్పోర్ట్స్ డ్రామా నుంచి మార్చి 27న సరికొత్త టీజర్ విడుదలై సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇప్పటికే విడుదలైన మొదటి టీజర్‌లో చరణ్ క్రికెట్ ప్లేయర్‌గా కనిపించి ఆకట్టుకోగా, తాజా టీజర్‌లో మాత్రం పూర్తిగా భిన్నమైన మాస్ అవతార్‌లో దర్శనమిచ్చాడు. కుస్తీ పోటీలలో పాల్గొనే శక్తివంతమైన యోధుడిగా ఆయన కనిపించిన తీరు అభిమానులను ఉర్రూతలూగిస్తోంది. భారీ దేహదారుఢ్యం, కఠినమైన చూపులు, రఫ్ లుక్ అన్నీ చరణ్ పాత్రను మరింత పవర్‌ఫుల్‌గా చూపిస్తున్నాయి. ఈ టీజర్ ద్వారా సినిమా నేపథ్యం, కథా గురించి కొంత క్లారిటీ వచ్చింది. ఉత్తరాంధ్ర గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో స్థానిక క్రీడలు, ముఖ్యంగా కుస్తీ పోటీలు కీలక పాత్ర పోషించనున్నట్లు తెలుస్తోంది. చరణ్ ఫిజిక్, బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌లో ఆమె పాత్ర కూడా ఆసక్తికరంగా ఉండబోతుందని సమాచారం. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, 'పెద్ది' సినిమా భారీ స్థాయిలో రూపొందుతోంది. కథ, టేకింగ్, మ్యూజిక్, యాక్షన్ అన్ని విభాగాల్లో ఈ చిత్రం కొత్త ప్రమాణాలు సృష్టించే అవకాశముందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.ఇప్పటికే టీజర్‌తోనే భారీ బజ్ క్రియేట్ చేసిన 'పెద్ది', విడుదల తర్వాత బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో చూడాల్సి ఉంది.


# రామ్‌చరణ్..నీ వ్యక్తిత్వమే శ్రీరామరక్ష

## తనయుడికి చిరంజీవి విషెష్



రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియాలో సందడి నెలకొంది. 'పెద్ది' గ్లింప్స్‌తో అభిమానుల్లో జోష్ పెంచారు. కుమారుడికి శుభాకాంక్షలు చెబుతూ చిరంజీవి అరుదైన ఫొటోలను పంచుకున్నారు. 'చరణ్ బాబు.. చిన్నప్పుడు నా వేలు పట్టుకొని నడిచిన స్థాయి నుంచి.. ఈరోజు ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచే స్థాయికి ఎదగడం చూస్తుంటే నాకు చాలా గర్వంగా ఉంది. సినిమా, వ్యక్తిగత జీవితాన్ని నువ్వు బ్యాలెన్స్ చేసే విధానం, కుటుంబంపై నీకున్న బాధ్యత, దేవుడిపై భక్తి, క్రమశిక్షణ, నీ విలువలు.. వీటిని చూసిన ప్రతిసారీ నీపై నా ప్రేమ, గౌరవం మరింత పెరుగుతూనే ఉన్నాయి. ఆ దేవుడి ఆశీస్సులు, అభిమానుల ప్రేమాభిమానాలు నిన్ను ఉన్నత శిఖరాలకు నడిపించాలని కోరుకుంటున్నాను' అని చిరంజీవి తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. 'పుట్టినరోజు శుభాకాంక్షలు మై స్వీటెస్ట్ కజిన్. ఈ ఇయర్ 'పెద్ది' మూవీ పెద్ద సక్సెస్ ఇవ్వాలని కోరుకుంటున్నా అంటూ అల్లు అర్జున్ తెలిపారు. 'హ్యాపీ బర్త్‌డే అన్నయ్య! నువ్వు చిన్నప్పుడు ఎంత అల్లరి చేసేవాడివో నాకు ఇప్పటికీ గుర్తుంది. కానీ ఇప్పుడు నిన్ను చూస్తుంటే చాలా గర్వంగా ఉంది. ఇంతటి విజయాన్ని అందుకున్నా కూడా నువ్వు ఎంతో వినయంగా ఉంటావు. నీలో ఆ లక్షణం నాకు ఎంతో ఇష్టం. జీవితాన్ని నువ్వు డీల్ చేసే విధానం నన్ను ఎప్పుడూ ఆశ్చర్యపరుస్తుంది. అనవసరమైన హడావుడి, డ్రామాలు లేకుండా సైలెంట్‌గా ఉంటూనే నీలోని ప్రేమను, బలాన్ని చూపిస్తావు. నువ్వే నా ధైర్యం. ఐ లవ్ యూ అని వరుణ్ తేజ్ పోస్ట్ పెట్టాడు. 'హ్యాపీ బర్త్‌డే రామ్ చరణ్. పెద్ది గ్లింప్స్ అదిరిపోయింది. ఈ సినిమాతో నువ్వు మరో బ్లాక్‌బస్టర్ అందు కోవాలని కోరుకు ంటున్నా అని నారా రోహిత్ విషెష్ చెప్పాడు.

# పవన్ తనయుడితో రామ్‌చరణ్




## బర్త్‌డే విషెస్ చెబుతూ అన్నాలెజ్నెవా పోస్ట్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నేడు తన పుట్టినరోజును ఘనంగా జరుపుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా అభిమానులు, సినీ ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తుండగా, సోషల్ మీడియా అంతా చరణ్ బర్త్‌డే పోస్టులతో నిండిపోయింది. ముఖ్యంగా మెగా ఫ్యామిలీ సభ్యులు షేర్ చేసిన ప్రత్యేక ఫోటోలు, సందేశాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం చరణ్ దర్శకుడు బుచ్చి బాబు సానా తెరకెక్కిస్తున్న 'పెద్ది' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఇటీవల షూటింగ్ సమయంలో గాయపడినప్పటికీ, త్వరగా కోలుకుని మళ్లీ సెట్స్‌లోకి వచ్చి అభిమానులను కలవడం ఫ్యాన్స్‌కు రిలీఫ్ ఇచ్చింది. ఈ బర్త్‌డే సందర్భంగా ఒక అన్‌సీన్ ఫోటో సోషల్ మీడియాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.పవన్ కళ్యాణ్ భార్య అన్నా లెజ్నెవా తన కుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్‌తో కలిసి చరణ్ ఉన్న ఒక క్యూట్ ఫోటోను షేర్ చేస్తూ బర్త్‌డే విషెస్ తెలిపారు. 'మార్క్ మరియు మాకుటుంబం తరపున చరణ్ అన్నకు హ్యాపీ బర్త్‌డే' అంటూ ఆమె చేసిన పోస్ట్ అభిమానులను ఆకట్టుకుంది. ఆ ఫోటోలో చరణ్ పక్కన కూర్చుని మార్క్ ఫోన్ చూస్తుండగా, చరణ్ ఎంతో ప్రేమగా అతన్ని గమనిస్తున్న తీరు నెటిజన్లను ఫిదా చేసింది. సాధారణంగా పవన్ కళ్యాణ్ కుటుంబానికి సంబంధించిన ఫోటోలు చాలా అరుదుగా బయటకు వస్తుంటాయి. అలాంటిది ఈ సందర్భంలో బయటకు రావడంతో మెగా ఫ్యాన్స్ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

# భక్తి, భావోద్వేగాల మేళవింపుగా ఇరుముడి



భక్తి, బంధాలు, భావోద్వేగాలతోపాటు... రవితేజ శైలి మాస్ అంశాల మేళవింపుతోనూ రూపొందుతున్న చిత్రమే 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రియ భవానీ శంకర్ కథానాయిక. బేబి నక్షత్ర, సాయికుమార్ ముఖ్య పాత్రల్ని పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే యాభై శాతం చిత్రీకరణని పూర్తి చేసుకుందీ చిత్రం. ప్రస్తుతం హైదరాబాద్‌లో యాక్షన్ సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. స్టంట్ కొరియోగ్రాఫర్లు అనల్ అరసు, రియల్ సతీశ్ నేతృత్వంలో విభిన్నమైన పోరాట ఘట్టాల్ని తెరకెక్కిస్తున్నారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని చిత్రబృందం ఓ ప్రత్యేకమైన పోస్టర్‌ని విడుదల చేసింది. తండ్రీకూతుళ్లుగా నటిస్తున్న రవితేజ, బేబి నక్షత్ర ఆ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. అద్భుతమైన కథ, కాన్సెప్ట్‌తో కూడిన చిత్రమిది. అయ్యప్ప మాల నేపథ్యం, అందమైన కుటుంబం, భావోద్వేగాలతోపాటు యాక్షన్ కూడా ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. తండ్రీ కూతుళ్ల బంధం ఈ సినిమాకి కీలకం. రవితేజ ఇప్పటివరకూ పోషించిన ప్రాతలతో పోలిస్తే ఇందులో మరింత ప్రత్యేకమైన పాత్రలో కనిపిస్తార'ని సినీ వర్గాలు చెప్పాయి. అజయ్ ఘోష్, రమేశ్ ఇందిర, శ్వాసిక, మీసాల లక్ష్మణ్, రాజ్‌కుమార్ సరిరెడ్డి, రమణ భార్గవ్, కిశోర్ కంచరపాలెం, కార్తీక్ అడుసుమిల్లి, మహేశ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జి.వి.ప్రకాశ్‌కుమార్, ఛాయాగ్రహణం: విష్ణు శర్మ, ప్రొడక్షన్ డిజైన్: సాహి సురేశ్, కూర్పు: ప్రవీణ్ పూడి.

# ఇప్పట్లో పెళ్లి ఆలోచన లేదు

## నిర్మొహమాటంగా చెప్పి సాయిపల్లవి



దక్షిణాది సినీ పరిశ్రమలో సహజ నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న స్టార్ హీరోయిన్ సాయి పల్లవి మరోసారి వార్తల్లో నిలిచారు. డ్యాన్స్ షోల నుంచి సినీ ప్రపంచంలోకి అడుగుపెట్టి, తన టాలెంట్‌తో టాప్ హీరోయిన్‌గా ఎదిగిన ఆమె ప్రయాణం నిజంగా స్ఫూర్తిదాయకం. చిన్నప్పటి నుంచే నాట్యం, నటనపై ఆసక్తి ఉన్నప్పటికీ చదువును ప్రాధాన్యంగా తీసుకుని మెడికల్ డిగ్రీ పూర్తి చేసిన సాయి పల్లవి, ప్రేమమ్ సినిమాలో 'మలర్ టీచర్' పాత్రతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత ఫిదా సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరై, తన సహజ నటన, తెలంగాణ యాసతో కుర్రకారును మెస్మరైజ్ చేసింది. దీంతో ఆమెకు 'లేడీ పవర్ స్టార్' అనే ట్యాగ్ కూడా వచ్చింది. ప్రస్తుతం ఆమె కెరీర్ పీక్‌లో ఉంది. బాలీవుడ్‌లో జునైద్ ఖాన్ తో కలిసి ఓ సినిమాతో ఎంట్రీ ఇస్తుండగా, ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ రామాయణం లో సీత పాత్ర పోషించడం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. అలాగే తమిళంలో ధనుష్ సరసన కూడా ఓ భారీ చిత్రంలో నటిస్తూ బిజీగా ఉంది. ఇదిలా ఉంటే, ఇటీవల ఆమె పెళ్లిపై వస్తున్న రూమర్లకు తానే స్వయంగా ఫుల్‌స్టాప్ పెట్టింది. ఒక కార్యక్రమంలో మీడియా అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ సాయి పల్లవి స్పష్టంగా తన అభిప్రాయం వెల్లడించింది. 'ప్రస్తుతం నా పూర్తి దృష్టి కెరీర్‌పైనే ఉంది. పెళ్లి గురించి ఇప్పట్లో ఎలాంటి ఆలోచన లేదు. నేను ప్రస్తుతం సింగిల్‌గానే ఉన్నాను అని చెప్పి అందరికీ క్లారిటీ ఇచ్చింది. ఆమె పెళ్లి విషయంపై సోషల్ మీడియాలో విభిన్న స్పందనలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఫ్యాన్స్ ఆమె నిర్ణయాన్ని సమర్థిస్తుంటే, మరికొందరు మాత్రం ఆమె పెళ్లి వార్త కోసం ఎదురుచూస్తున్నారు.

# రామ్‌చరణ్‌కు పవన్ బర్త్‌డే విషెష్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా జనసేనాని, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సోషల్ మీడియా వేదికగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. చరణ్ వ్యక్తిత్వం, కృషి, విలువలను ప్రశంసిస్తూ పవన్ రాసిన సందేశం అభిమానులను ఎంతో ఆకట్టుకుంది. నటన పట్ల అంకితభావంతో ప్రతి సినిమాను ఎంతో కష్టపడి పూర్తి చేసే చరణ్ నిబద్ధతను పవన్ ప్రత్యేకంగా కొనియాడారు. వృత్తి పరంగానే కాకుండా, వ్యక్తిగత జీవితంలోనూ చరణ్ ఉన్నతమైన విలువలను పాటిస్తాడని ఆయన పేర్కొన్నారు. కుటుంబ బంధాలకు ఇచ్చే ప్రాధాన్యత, పెద్దల పట్ల గౌరవం, తోటి నటులు మరియు సాంకేతిక నిపుణుల పట్ల చూపించే మర్యాద చరణ్‌ను ప్రత్యేక వ్యక్తిగా నిలబెడతాయని పవన్ అభిప్రాయపడ్డారు.ముఖ్యంగా చరణ్‌లోని ఆధ్యాత్మికత, దైవభక్తి ఆయనకు ఎల్లప్పుడూ మార్గదర్శకంగా ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. చరణ్ మరెన్నో విజయాలు సాధించాలని, ఆయుష్షు, ఆరోగ్యం, ఆనందంతో జీవితాన్ని కొనసాగించాలని దేవుడిని ప్రార్థిస్తూ పవన్ కళ్యాణ్ తన శుభాకాంక్షలను ముగించారు.